

## బిల్లులు కావాలా.. లంచం ఇవ్వాల్సిందే..!

రూ.లక్షన్నర తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, డీఈ రమేష్

7

## ఏలూరు నగర కమిషనర్ భానుప్రతాప్‌కు మెమో జారీ

బాపట్ల మున్సిపాల్టీలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణంపై వివరణ కోరుతూ..



**ఒకే ఏడాదిలో 2 వేల కోట్లు పరిహారం**

పోలవరం ప్రాజెక్టు పనులను నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఫొటో ఎగ్జిబిషన్, మ్యాప్ పాయింట్‌లను పరిశీలించారు. జలవనరులశాఖ అధికారులు, మేఘా సంస్థ ప్రతినిధులతో పనులపై సమీక్షించారు. - మెయిన్‌లో

## ఈ జడ్పీటీసీ అంత చులకనయ్యారా ?

- వైసీపీలో విలువ, గౌరవం దక్కడం లేదని ఆవేదన..
- పార్టీ కార్యక్రమాలకు దూరం

(దెందులూరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీలో సరైన విలువ, గౌరవం దక్కడం లేదన్న ఆవేదనతో దెందులూరు జడ్పీటీసీ నవకాంతం దంపతులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం ఆ పార్టీలో తీవ్ర దుమారం రేపుతోంది. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, కీలకమైన మండల నేతల వ్యవహారశైలి సక్రమంగా లేదని పలువురు బాహాటంగానే విమర్శల వర్షం కురిపిస్తున్నారు. దళిత సామాజిక వర్గంలో ఓ మోస్తరు పేరున్నా నిట్టా లీలా నవకాంతం 2021 జడ్పీటీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందారు. అయినా అప్పటి నుంచి పార్టీలో పెద్దగా విలువ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం అధికారం లో లేనప్పటికీ పార్టీ కార్యక్రమాలకు ఆహ్వా నం, సంప్రదింపులు లేక పోవడంతో ఆమె కొంత గుర్రుగా ఉన్నారు. ఆమె భర్త నిట్టా గంగ రాజు సీనియర్ లీడరే. నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ, ఇతర ధర్నాలు, నిరసనల్లో జడ్పీటీసీ పాల్గొన లేదు. ఇటీవల పార్టీకి దూరంగా ఉండడం ఉత్తమనన్న నిర్ణయం తీసుకోవడంతో ఆ సామాజిక వర్గంలో తీవ్ర చర్చ సాగుతోంది. మనకు గుర్తింపు లేనప్పుడు.. ఇక్కడ కొనసాగడం అవసరమా? అన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. వైసీపీ అభిమానులు, ఇతర నాయకులతో రహస్యంగా ఓ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. ఇక పార్టీతో తాడేపేడో తేల్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. 'మాకు తెలియకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు ప్రతిపక్షంలోను మమ్మల్ని పట్టించుకోకపోతే ఎలా..' అంటూ జడ్పీటీసీ దంపతులు కార్యకర్తల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం.



# నల్లికాటు.. జ్వరం పోటు!



## మహిళకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణ..ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స

- గత నెలలో మరొకరికి పాజిటివ్.. సాధారణ చికిత్సతోనే నయం
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- విస్తృత అవగాహన, పారిశుధ్య కార్యక్రమాలకు చర్యలు
- జీజీహెచ్‌లో నిరుపయోగంగా ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్

ఏలూరు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొద్దిరోజులుగా కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్ అనే ఓ రకం నల్లి/పురుగు కాటు వ్యాధి ఏలూరు జిల్లాలోనూ పలువురిని కాటేయడం ప్రారంభించింది. ఎక్కువగా పొలాలు, అపరిశుభ్ర ప్రాంతాలు, మురికివాడల్లో నివసించే లేదా సంచరించే వ్యక్తులను స్క్రబ్ టైఫస్ నల్లులు కుడుతుండగా, తొలుత సాధారణ జ్వరంతో మొదలై, రోజుల వ్యవధిలోనే తీవ్రత, ఇతర రుగ్మతలతో రోగిని అతలాకుతలం చేస్తున్నాయి. వాస్తవానికి గత నెలలోనే టి.నరసాపురానికి చెందిన 30 ఏళ్ల పురుషుడికి స్క్రబ్ టైఫస్ సోకినట్టుగా నిర్ధారణ కావడం, ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆరోగ్యంగా బయటపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాజాగా గురువారం పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన ఓ గృహిణి(50)కి ఈ వ్యాధి నిర్ధారణ అయింది. ఫీవర్ సర్వేలో భాగంగా తొలుత నవంబరు 15న జ్వరం బారిన పడిన ఈ మహిళను స్థానిక ఆశా కార్యకర్త గుర్తించింది. మహిళకు పారాసిటమాల్ మాత్రలను ఇచ్చింది. జ్వరం అదుపులోకి రాకపోవడంతో రెండోరోజు వట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వద్దకు వెళ్లగా, బ్యాక్టీరియల్ ఫీవర్‌గా భావించి చికిత్స చేసి పంపించేశారు. మూడు రోజులు గడిచినా జ్వరం తగ్గకపోవడంతో కొప్పాకలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లింది. అయినప్పటికీ జ్వరం తీవ్రత ఎక్కువవుతుండటంతో నవంబరు 26న ఏలూరు జీజీహెచ్‌లో చేరింది. రోగ లక్షణాలను బట్టి అనుమానించిన జీజీహెచ్ వైద్య నిపుణులు ఈ నెల 3న ఎలీసా టెస్టుకు శాంపిల్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపగా, గురువారం ఆమెకు స్క్రబ్ టైఫస్ పాజిటివ్ రిపోర్టు వచ్చింది. ప్రస్తుతం ఆమెను ఆసుపత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. తాజా కేసుతో అప్రమత్తమైన వైద్యశాఖ ముందస్తు నివారణ చర్యలతో పాటు, ప్రజలకు అవగాహన, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో స్క్రబ్ టైఫస్‌ను ఎదుర్కొవడానికి కార్యాచరణ ప్రారంభించింది.



ఏలూరు జీజీహెచ్‌లో మూతపడిన ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్

### లక్షణాలివే..

పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పొదలు, మొక్కల్లో ఎక్కువగా ఈ కీటకం (నల్లి) కనబడుతుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. శరీరంపై ఈ నల్లులు కరిచినప్పుడు వాటి లాలాజలం ద్వారా బ్యాక్టీరియా మనిషిలోకి ప్రవేశిస్తుంది. తొలుత ఎర్రని పుండు ఏర్పడి, క్రమేణా మాడిపోయినట్టు నల్లరంగులోకి మారుతుంది. ఇది పొలుసులతో కూడిన గాయం మాదిరి ఉంటుంది. నొప్పి ఉండదు. నల్లి కరిచిన తర్వాత లక్షణాలు కనిపించడానికి 6 నుంచి 21 రోజుల వ్యవధి ఉంటుంది. ఈ వ్యవధిలోనే బాక్టీరియా శరీరంలో వృద్ధి చెందుతుంది. తీవ్ర జ్వరం, వణుకు, తలనొప్పి, పొడి దగ్గు, కండరాల నొప్పులు, దద్దుర్లు, వికారం, వాంతులు, కడుపు నొప్పి వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో చికిత్స చేయకపోతే బ్యాక్టీరియా మెదడుకు వ్యాపించడం, నుమోనియా, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్రపిండాలతో సహా పలు అవయవాలను ప్రభావితం చేస్తుందని హెచ్చరిస్తున్నారు. అనుమానిత లక్షణాలున్న రోగికి రక్తపరీక్షలు, ఇతర వైద్యపరీక్షలతో స్క్రబ్ టైఫస్‌ను నిర్ధారిస్తారు. లక్షణాలను గుర్తించడం, సరైన సమయంలో చికిత్సతోనే రోగిని రక్షించవచ్చని భరోసా ఇస్తున్నాయి.

### వైద్యుల పర్యవేక్షణలో చికిత్స మేలు

స్క్రబ్ టైఫస్‌కు చికిత్స సాధారణమైందేనని, ఇది సోకిన రోగినుంచి ఇతరులకు వ్యాప్తి చెందే అంటువ్యాధి కాదు. యాంటీ బయాటిక్స్ చికిత్సతోనే నయం చేయవచ్చు. సాధారణంగా డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి ఔషధాలతో గరిష్ఠంగా రెండు రోజుల వ్యవధిలోనే ఉపశమనం పొందవచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఈ ఔషధాలను రోగతీవ్రత, లక్షణాల మేరకు వైద్యనిపుణుల సూచనలు, సలహాలను పాటిస్తూ, వారి పర్యవేక్షణలోనే వినియోగించాలే తప్ప సొంతంగా నిర్ణయాలను తీసుకోరాదని హెచ్చరిస్తున్నారు.

### ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్‌ను తెరవండి

బ్యాక్టీరియా సంబంధిత వైరల్ రోగాలు, జబ్బులు, తీవ్రతను నిర్ధారించేందుకు సంబంధిత రోగుల శాంపిల్స్‌ను పరీక్షించడం ద్వారా అవసరమైన ఖచ్చితమైన వైద్య నివేదికలను అందించడానికి, తద్వారా సరైన వైద్య చికిత్సలకు ఉపయోగపడే కీలకమైన ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్ ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గత ఆగస్టు నుంచి మూతపడింది. రక్త, స్వాబ్ నమూనాలను సమగ్రంగా విశ్లేషించి రోగ నిర్ధారణలో, తీవ్రతలోనూ ఈ ల్యాబ్ ఇచ్చే రిపోర్టులనే వైద్య వర్గాలు ప్రామాణికంగా తీసుకుని చికిత్సలను చేపడతాయి. కొవిడ్ మహమ్మారి కాలంలో సేవలందించిన ఈ ల్యాబ్‌కు విధులు నిర్వర్తించే వైద్యసిబ్బంది లేక ఆగస్టు చివరి వారం నుంచి మూసివేశారు. ప్రజారోగ్య - మిగతా 8వ పేజీలో

### అన్ని పీహెచ్‌సీలను అప్రమత్తం చేశాం

**డాక్టర్ పీ.జే అమృతం, ఏలూరు డీఎంహెచ్‌వో**

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు గురువారం జూమ్ మీటింగ్ నిర్వహించి అప్రమత్తం చేశాం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ముందస్తుగానే దీని నుంచి నివారణ పొందవచ్చు. డీట్ కలిగిన పురుగుల నివారణి ఆయింట్మెంట్‌ను చర్మంపై రాసుకోవాలి. పొలాలు, పొదలు, గడ్డి, పశువుల పాకల్లో పనిచేసేవారు లేదా ఆ ప్రాంతాల్లోకి వెళ్లేవారు పొడవాటి చొక్కాలు, ప్యాంటు, బూట్లు వంటివి ధరించాలి. స్నానం చేయడం, దుస్తులను క్రమం తప్పకుండా మార్చడం వంటి వ్యక్తిగత పరిశుభ్రతను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చేయాలి. నల్లి కరిచిన ప్రదేశంలో నల్లటిమచ్చ కనబడితే లేదా అనుమానిత లక్షణాలు కనబడితే వైద్యులను సంప్రదించాలి. సకాలంలో గుర్తించి చికిత్సచేస్తే పూర్తిగా నయంచేయవచ్చు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను సంపూర్ణంగా చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా తీవ్రజ్వరం బారినపడితే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్తే అక్కడి వైద్యాధికారి రోగలక్షణాలను పరిశీలించి, అవసరమని భావిస్తే రక్తనమూనాను తీసుకుని వ్యాధి నిర్ధారణ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి పంపిస్తారు. అక్కడ బ్లడ్ శాంపిల్‌కు ఎలీసా టెస్టు నిర్వహించి 12 గంటల వ్యవధిలో ల్యాబ్ రిపోర్టు ఇస్తారు. జీజీహెచ్‌లో సరిపడినన్ని ఎలీసా టెస్టు కిట్లు అందుబాటులో ఉన్నాయి.

## ఏఆర్ ఏఎస్పీగా మునిరాజా



ఏలూరు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లా ఆర్మ్‌డు రిజర్వుడు విభాగం అదనపు ఎస్పీగా జి.మునిరాజా గురువారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఆర్ఎస్ఐగా పోలీస్ విభాగంలో 1992లో చేరిన మునిరాజా గ్రేహౌండ్స్ విభాగం కర్నూలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా కడప, అనంతపురం, టీటీడీ విజిలెన్స్‌లో పనిచేశారు. 2010లో డీఎస్పీగా పదోన్నతి పొంది తిరుపతి ఏఆర్, అనంతపురం ఎస్టీఎఫ్, కల్యాణ్ డ్యామ్ పీటీసీలో పనిచేశారు. ఏఎస్పీగా పదోన్నతి పొందిన ఆయనను ఏలూరు జిల్లా ఏఆర్ విభాగానికి నియమించారు. గురువారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావును ఆయన కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఏఆర్ డీఎస్పీ వి.చంద్రశేఖర్, ఆర్ఐ సతీష్, ఆర్ఎస్ఐ నరేంద్ర, భాస్కరరావు, సత్యనారాయణ, వెంకటేష్, అమరేశ్వరరావు, ఏఆర్ఎస్ఐలు పలువురు ఏఆర్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మునిరాజాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మోర్చా అధ్యక్షులకు నియామక పత్రాలు ఇస్తున్న విక్రమ్ కిశోర్

## బీజేపీ మోర్చా అధ్యక్షుల నియామకం

ఏలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లా బీజేపీ అనుబంధ శాఖల్లోని మోర్చా విభాగాల అధ్యక్షులను నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ గురు వారం ప్రకటించి వారికి నియామక ఉత్తర్వులు అందించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా అగ్రహారపు వెంకటేశ్వరరావు, యువ మోర్చా అధ్యక్షుడిగా అదబాక నాగసురేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఇలపకుర్తి కుసుమకుమారి, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా కీర్తి రామ్‌ప్రసాద్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బుర్రి శ్రీకర్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ మీర్ జాఫర్ ఆలీలను అధిష్ఠానం నియమించింది. వీరిని జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణప్రసాద్, జిల్లా మీడియా కన్వీనర్ బాడిత నారాయణరావు, నాగం శివ, కాశేశ్వరరావు, గణపతి అభినందించారు.

హత్యాయత్నం కేసులో వైసీపీ నేత సహా ఏడుగురి అరెస్టు 7

## నేడు మెగా పీటీఎం

- హాజరయ్యే మంత్రి, ఎమ్మెల్యేలు ఖరారు
- కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



పేపర్లతో బొకేలు తయారు చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్-టీచర్ 3.0 జరగనుంది. ఈ మేరకు విద్యాశాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సమా వేశాల్లో పాల్గొనేందుకు ప్రముఖులు జిల్లా విద్యా శాఖకు సమాచారమిచ్చారు. ఇప్పటికే జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు మెగా పీటీఎంలో ఎక్కడెక్కడ పాల్గొనేదీ స్పష్టతనివ్వగా, తాజాగా సమాచారమిచ్చిన వారిలో మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు జడ్పీ హైస్కూలులో, కలెక్టర్ వెట్రిసెల్వి దెందులూరులో దత్తతతీసుకున్న బాలల సదనం/ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆటపాక జడ్పీ హైస్కూలులో, చింతల పూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రగడవరం జడ్పీ బాలికల హైస్కూలులో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించే మెగా పీటీఎంలో పాల్గొంటారు. నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం మెగా పీటీఎం నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదే శించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. బాల బాలికల విద్యాపురోగతి కోసం, ప్రజల భాగస్వామ్యం ప్రధాన లక్ష్యాలుగా ఈ సమావేశాలు జరగాలని సూచించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## డీడీవో కార్యాలయాలు ప్రారంభం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లాలో మూడు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాల యాలను వర్చువల్‌గా ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ గురువారం ప్రారంభించారు. ఏలూరు శనివారపు పేటలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించారు.

■ లోపలి పేజీలో..



# మొక్కుబడిగా...

- రైతులకు సమాచారం ఇవ్వకుండా ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు
- అధికారుల తీరుపై రైతుల ఆవేదన



జీలుగుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తున్న ఎస్‌డీసీ చంద్రశేఖర్ రెవెన్యూ సిబ్బంది

జీలుగుమిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులు గురువారం నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ తూతూ మంత్రంగా జరిగింది. ఇటీవల పోలవరం నిర్వాసిత గ్రామాలకు భూ సేకరణ చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారులతో గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తోంది. అయితే గ్రామ సభలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని భూములు - మిగతా 8వ పేజీలో

## అటవీ భూములకు ట్రెంచ్ కట్ ఏర్పాటు



నూజివీడు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం దేవరగుంట-జంగంగూడెం గ్రామాల సరిహద్దుల్లోని అటవీ భూములకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల సంక్షేమంలో ట్రెంచ్ కట్ నిర్వహించారు. గ్రామ సరిహద్దుల్లో ఉన్న అటవీ భూముల ఆక్రమణల విషయంలో ఇరు గ్రామాల మధ్య వివాదం చెలరేగి గ్రామాల రైతులు దాడులకు దిగిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇటీవల వివాదాస్పద భూమి వద్ద ఇరు గ్రామస్థులతో చర్చించారు. అటవీ భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరమని అటవీ భూముల సంరక్షణకు సరిహద్దు విభజించి అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారు. రెవెన్యూ, పోలీస్, అటవీశాఖల అధికారులు సంయుక్తంగా ఎస్కవేటర్ సహాయంతో ట్రెంచ్ కట్‌ను ఏర్పాటు చేసినట్టు నూజివీడు డిప్యూటీ తహసీల్దార్ రవికిరణ్‌సింగ్ తెలిపారు.

# స్మార్ట్‌గా.. సూక్ష్మసేద్యం!



నూజివీడు మండలం జంగంగూడెంలోని ఓ రైతు పొలంలో ఆటోమేషన్ విధానం అమలును పరిశీలిస్తున్న మైక్రో ఇరిగేషన్ పీడీ రామ్మోహన్‌రావు

- సరికొత్తగా ఆటోమేషన్ విధానం
- విద్యుత్ ఆదా.. ప్రమాదాల నివారణ
- యూనిట్ వ్యయం హెక్టారుకు రూ.40 వేలు ..రైతులకు సబ్సిడీ అందజేత
- తొలివిడతగా 100 యూనిట్లు మంజూరు

జిల్లాలో సూక్ష్మసేద్యానికి విరివిగా సబ్సిడీల అందజేతతో అంతర పంటలు, వాణిజ్య పంటల సాగు దిశగా రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. మధ్య తరహా రైతులకు పెద్దమొత్తంలో లబ్ధి చేకూర్చడంతోపాటు.. ఆధునికతను రైతులు అందిపుచ్చుకునేలా సబ్సిడీలను అందిస్తోంది. ఇంటి నుంచే ఆన్, ఆఫ్ లైన్ విధానంలో పంటల సాగు నీటి సరఫరాను పర్యవేక్షించేందుకు తాజాగా సబ్సిడీలకు రంగం సిద్ధం చేసింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సూక్ష్మసేద్యానికి ఆధునికతను జోడించే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. వాణిజ్య, అంతరపంటల సాగులో పంటలకు నీరందించే విషయంలో బోర్లు, ఇతర మోటార్లను ఆన్, ఆఫ్ చేయడానికి పొలాల్లోకి రైతులు రాత్రుళ్లు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. పొలాల్లో విష పురుగులు కుట్టి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరోవైపు పంటలకు నీరు సరిపోయినా పొలాలకు వెళ్లడం మరిచిపోతే విద్యుత్ వినియోగం పెరిగిపోతుంది. కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ వృథా కాకుండా ఉండేందుకు సూక్ష్మసేద్యంలో ఆటోమేషన్ విధానానికి ఈ వారంలో శ్రీకారం చుట్టింది. నల్లజర్లలో బుధవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆటోమేషన్ విధానంపై చర్చ జరిగింది. జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ విధానంపై వివరించారు. సీఎం స్పందిస్తూ ఈ విధానం ప్రవేశ పెడితే ఏటా రాష్ట్రవ్యాప్తంగా రూ.ఐదు వేల కోట్లు విలువైన విద్యుత్ ఆదాను చేయవచ్చన్నారు. జిల్లాలో పామాయిల్, కోకో, కొబ్బరి, మొక్కజొన్న తదితర పంటల విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నేపథ్యలో ఆటో మేషన్ విధానంతో రైతులు ఎంతో మేలు జరుగుతుంది.

### సెల్‌ఫోన్‌తో నీటి సరఫరా పర్యవేక్షణ

బిందు,తుంపర సేద్యం (మైక్రో ఇరిగేషన్) పరికరాల్ని రైతులు ఇక నుంచి సెల్‌ఫోన్ నుంచి ఆన్/ఆఫ్ చేసుకోవచ్చు. వాల్వ్‌ల ఆన్, ఆఫ్ ఇంటి నుంచే పర్యవేక్షించే దిశగా ఏర్పాటు చేశారు. బిందు,తుంపర సేద్యంలో వైర్‌లెస్ ఆటోమేషన్ పరికరాలు ఏర్పాటు చేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. యూనిట్ వ్యయం హెక్టారుకు రూ.40 వేలుగా నిర్ణయించింది. గరిష్ఠంగా ఎస్సీ,ఎస్టీ, చిన్న,సన్నకారు రైతులకు 55 శాతం రాయితీ - మిగతా 8వ పేజీలో

### ఇదొక బృహత్తర పథకం

మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ విధానం అమలుకు తొలి ప్రాధాన్యంగా 100 యూనిట్లకు సబ్సిడీలు ఇవ్వాలని నిర్ణయించాం. ఇదొక బృహత్తర పథకం. రైతులు వినియోగించుకోవాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు సబ్సిడీలు వర్తింపు చేస్తున్నాం. ఇప్పటికే 10 కంపెనీలు వీటిని సరఫరా చేయడానికి ముందుకొచ్చాయి. ఇందులో నాలుగు కంపెనీల ఎంపిక పూర్తయింది. ఈ విధానం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని, రైతులు ప్రమాదాల బారిన పడకుండా నివారించడానికి అవకాశం ఉంది.

**- రామ్మోహన్‌రావు, మైక్రో ఇరిగేషన్ పీడీ**

# గేట్.. కష్టాలు!

» ఆకివీడులో రైల్వే గేటుతో హడలిపోతున్న వాహనదారులు

» అరగంట నిరీక్షించాల్సిందే.. » ఆర్వోబీ ఏర్పాటుతోనే సమస్యకు పరిష్కారం



ఆకివీడులో సిద్ధాపురం వెళ్లే రైల్వే గేటు

ఆకివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడులో రైల్వేగేట్లంటేనే ప్రజానీకం హడలెత్తి పోతున్నారు. ఎప్పుడు పడతాయో తెలియదు, పడితే ఎప్పుడు తెరుచుకుంటాయో తెలియదు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా ఎక్కువ సమయం ఆగిపోవాల్సి వస్తున్నది. అంబులెన్స్‌లు వేరే మార్గంలో వెళ్ళడానికి కూడా లేని పరిస్థితి. ఆకివీడు రైల్వే స్టేషన్‌కు సమీపంలో అటూ, ఇటూ రెండు గేట్లు ఉన్నాయి. అంతే కాకుండా ఆకివీడు నుంచి గుమ్ములూరు వైపు వెళ్ళడానికి ఒకటి, దుంపగడప వెళ్ళడానికి మరోగేటు ఉన్నాయి. ఆకివీడు మీదుగా రోజూ 16 ఎక్స్‌ప్రెస్‌లు, ఐదు పాసింజర్లు, పదిహేను, ఇరవై గూడ్సు రాకపోకలు సాగిస్తుండడంతో అనేకసార్లు గేట్లు వేసి తీయాల్సి వస్తుంది. గేట్లు పడ్డాయంటే కనీసం ఇరవై నిమిషాలు పడుతుంది. ఒకేసారి రెండు రైళ్లు వస్తే సుమారు నలభై నిమిషాలు పడుతుంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు నరకం చూస్తున్నారు. గేట్లు పడినప్పుడు అధిక సంఖ్యలో వా హనాలు నిలిచిపోవడం నిత్యకృత్యంగా మారింది. తరచూ ట్రాఫిక్ నిలుస్తుండడంతో సమయానికి జనం గమ్యానికి చేరుకోలేపోతున్నారు. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు దశాబ్దాల కల ఎప్పుడు నెరవే రుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇటీవల రైల్వే అధికారులు గేట్లతో ప్రమేయం లేకుండా ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పి వెళ్ళిపోయారు. నేటికి పనులు చేపట్టిన దాఖాలాలు లేవు.

### తీరనున్న కష్టాలు?

ప్రజానీకానికి రైల్వే ఆర్వోబీ (ఫ్లైఓవర్), అండర్‌పాస్ కష్టాలు తీరనున్నట్లు తెలుస్తోంది. సిద్ధాపురం, దుంపగడప వైపు వెళ్లె రైల్వేగేట్లు దగ్గ ర నిర్మాణాలకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపినట్లు విశ్వసనీయ సమాచారం. సిద్ధాపురం, దుంపగడప వైపు వెళ్ళె రైల్వేగేట్లు దగ్గర ఇటీవల సంబంధిత అధికారులు సర్వే చేసి వెళ్ళిన తరువాత విద్యుత్‌కు సంబంధించి స్తంభాలు ఎన్ని అడ్డుగా ఉంటాయి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. రైల్వేగేట్లు దగ్గర నిర్మాణాలకు అనుమతులు కూడా మంజూరైనట్లు తెలుస్తోంది.

### ఉన్నతాధికారుల దృష్టికి..



ఆకివీడులో గేట్లు పడినప్పుడు ప్రజానీకం ఇబ్బం దులు పడుతుండడంతో బాధితులు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ విషయం పాలకులు, ఉన్నతధికారులు దృష్టికి తీసుకెళ్లాం. రైల్వే నిబంధనల మేర గేట్లు వేసి తెరుస్తున్నాం. త్వరలో వందేభారత్ ఆకివీడు మీదుగా వెళ్ళడం వలన భీమవరం, కైకలూరులో ఉండగానే గేటు వేయాల్సి వస్తుంది.

**- ఎస్.గౌరీనాయుడు, రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్, ఆకివీడు**

### నిబంధనలు పాటించడంలేదు



రైల్వే అధికారులు నిబంధనలు పాటించడంలేదు. రైల్వేగేట్లు వేసిన ఏడు నిమిషాలు తరువాత తెరవాల్సి ఉండగా ఇరవై నిమిషాలు పైనే పడుతుంది. దీంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గేట్లు దగ్గర అటూ, ఇటూ సరైన ఖాళీ స్థలాలు లేకపోవడంతో ప్రమాదాలు తలెత్తుతున్నాయి.

**- నేరెళ్ళ పెదబాబు, జోనల్ రైల్వే యూజర్స్ కౌన్సిల్ కమిటీ మాజీ సభ్యుడు, ఆకివీడు**

### పంచాయతీ తీర్మానం కావాలి



రైల్వేగేట్లు దగ్గర ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలు నిర్మాణలకు నగర పంచాయతీ తీర్మాణాలు చేయించాలని ఇటీవల పరిశీలించడానికి వచ్చిన అధికారులు తెలిపారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళాం. త్వరలో తీర్మాణం చేయడం జరుగుతుంది. తీర్మానం కాపీలు అధికారులకు పంపించాల్సి ఉంటుంది.

**- పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్, ఆకివీడు**

### అసౌకర్యంగా ఉంది



ఆకి వీడు నుంచి పొలం వెళ్ళాలంటే గేటు దాటి వెళ్ళి రావాలి. నిత్యం గేటు పడుతుం డడంతో అసౌకర్యానికి గురవుతున్నాం. అధికారులు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి.

**- బొల్లా శేషుబాబు, రైతు, ఆకివీడు**

## ఆర్వోబీ నిర్మాణంలో ఆలస్యం



ఉండిలోని రైల్వే గేటు

ఉండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండి-ఆకివీడు రహదారిలో వున్న రైల్వేగేటు వలన ప్రయాణిలు ఇక్కట్లుపడుతున్నారు. ఇదే ప్రాంతంలో ఆర్వోబి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రతిరోజు రైళ్ల రాకపోకల సమయంలో సుమారుగా 50సార్లు గేటుపడుతున్నది. దాంతో ఉండి నుంచి కైకలూరు, ఏలూరు, గుడివాడ, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ఉండి నుంచి భీమవరం వైపుకు గణపవరం వైపుకు వెళ్లే ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

### త్వరగా ఆర్‌వోబీ నిర్మించాలి

**- మానేప్రసాద్, ఉండి**



ఉండిలో చేపట్టిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూరి చేయాలి. తరుచుగేటు పడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది.

### ఎండకు...వానకు గేటులోనే

**- పోలుబోతు రాము, ఉండి**

రైలు గేటు పడిన సమయంలో ఎండ ఉన్నా వర్షం పడుతున్నా పడిగాపులు పడాల్సి వస్తున్నది. అత్యవసర పనులు మీద వెళ్లే వారికి ఇబ్బంది ఎర్పడుతున్నది. ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్నారు.

## సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్ మొదటి విరాళం




ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాయుధ దళాల పతాక దినోత్సవం డిసెంబర్ 7ను పురస్కరించుకుని వాల్‌పోస్టర్, స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో సాయుధ దళాల పతాక నిధికి మొదటి విరాళం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారత సైనిక దళాలు దేశభక్తి, సాహసం, త్యాగాలు పట్ల దేశం గర్విస్తున్నదని, ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లోను, ప్రకృతి వైపరీత్యాలు సమయంలోను, దేశ సరిహద్దుల్లో మన సైనికులు ధైర్యసాహసాలకు దేశం గర్విస్తోందని అన్నారు. ఎంతో మంది సైనిక సహోదరులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించారని వారందరికీ మనమందరం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక నిధికి తమ వంతుగా ప్రతి ఒక్కరూ విరాళాలు అందజేస్తే వారి కుటుంబాలకు ఎంతో సహాయ పడుతుందని అన్నారు. ప్రజలు అందించే విరాళాలు జిల్లా సైనిక సంక్షేమ అధికారి, పశ్చిమ గోదావరి జిల్లా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబర్ 62068471992, ఐఎఫ్‌ఎస్సీ కోడ్ ఎస్‌బిఐఎన్0012722కు పంపాలనానరు. ఈ విరాళాలకు ఆదాయపుపన్ను చట్టం 1961 ద్వారా ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఎస్.కొండలరావు, ఎక్స్ జెడబ్ల్యుఓడీవి రామయ్య, ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 26 లక్షలకు పెరిగిన మహిళా ప్రయాణికులు



జంగారెడ్డిగూడెం బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండి ద్వారకాతిరుమలరావు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో స్త్రీశక్తి పథకం విజయవంతంగా నడుస్తున్నదని ఏపీ ఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండులోని స్టాల్స్, కార్గో కౌంటర్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి రోజు 65 శాతం మహిళలు, 35 శాతం పురుషులు ఉపయోగించుకుంటున్నారన్నారు. గతంలో ప్రతి రోజు 40 లక్షల మంది ప్రయాణికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటే వారిలో 16 లక్షల మంది మహిళలు ప్రయాణించే వారని స్త్రీశక్తి పథకం అమలవుతున్నప్పటి నుంచి ప్రతి రోజూ రాష్ట్ర వ్యాప్తంగా 26 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ఈ పథానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.160 కోట్లు చెల్లిస్తుందన్నారు. పెరుగుతున్న ఆక్యుపెన్సీ దృష్ట్యా రాష్ట్రంలో 1050 నూతన ఎలక్ట్రిక్ బస్సులతో పాటు నూతన పల్లెవెలుగు బస్సులు కూడా రానున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు కూడా ప్రభుత్వం ఉచిత బస్సు సర్వీసు అందించనుందని త్వరలోనే దీనిపై స్పష్టత రానుందని తెలిపారు. కార్యక్రమానికి ముందు ఆయనకు ఆర్టీసీ అధికారులతో పాటు స్థానిక ఏఎస్పీ సుస్మిత పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. స్థానిక ఆర్టీసీ డ్రైవరు బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోవడంతో ఆర్టీసీ సంస్థ ఉద్యోగంలో నుంచి తొలగించిందని అతని కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ ఆర్టీసీ ఎండీని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ ఎ.అప్పలరాజు, డీసీటీవో ఎస్‌కె. షబ్బిం, విజిలెన్స్ ఏడీ. ఎల్.మధుసూధనరావు, డిఎం. గంగాధరరావు, విజయవాడ జోన్ సెక్యూరిటీ అధికారి ఐవీవీపీవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ కేంద్రాల పరిశీలన



రాయలంలో రెడ్‌క్రాస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీహరిరావు

భీమవరం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు, ట్రెజరర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డి. శ్రీహరి రావు గురువారం రాయలం, భీమవరంలోని రెడ్‌క్రాస్ కంపోనెంట్ బ్లడ్ సెంటర్, రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్లను సందర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల అనంతరం బాధ్యతలు స్వీకరించిన తర్వాత, వారు మొదటిసారిగా జిల్లాలో ఈ పర్యటన చేశారు. ఈ రెండు కేంద్రాలను అత్యుత్తమ నాణ్యతతో కొనసాగించాలని సూచించారు. తలసేమియా చిన్నారులకు చైర్మన్ పెయింటింగ్ పుస్తకాలు క్రేయాన్లను అందజేశారు గురువారం పెరవలి నుంచి వచ్చిన జంట బాలికలకు విజయవంతంగా బ్లడ్ అందించారు. రెడ్‌క్రాస్ పశ్చిమ గోదావరి శాఖ చైర్మన్ డాక్టర్ బాద్రీ రాజు, వబిలిశెట్టి కనక రాజు (వైస్ చైర్మన్), సభ్యులు రఘు సీతారామ రాజు, సుచిత్ర, కృష్ణారావు, కోఆర్డినేటర్లు మల్లేశ్వ రరావు, ఆచార్యులు పాల్గొన్నారు



అధ్యక్షుడు రాజును సత్కరిస్తున్న దృశ్యం


## అధిక లోడు పేరుతో వేధింపులు ఆపాలి

భీమవరం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో పని చేస్తున్న ట్రక్ ఆటో, వ్యాన్ డ్రైవర్లపై అధిక లోడ్ల పేరుతో ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు గురువారం నాడు భీమవరం ప్రాంతంలో ఉన్న ట్రక్, బొలెరో వ్యాన్ డ్రైవర్లు 150 మంది సీఐటీ యూ యూనియన్‌లో చేరారు. వ్యవ సాయం మార్కెట్ యార్డులో జరిగిన సభకు కె.రాజు అధ్యక్షత వహించారు. చిన్న చిన్న వృత్తులు చేసుకునే రవాణా కార్మికులపై ఆర్టీఏ అధికారులు వేధింపులకు గురి చేయటం దారుణం అన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. భీమవరం ఏరియా ట్రక్కు అండ్ బొలెరో వాహనాల డ్రైవర్ కార్మికుల అసోసియేషన్ అధ్యక్షుడుగా కె.రాజు ఉపాధ్యక్షుడుగా వి.శ్రీనివాస రాజు, కార్యదర్శిగా బి.శ్రీను, సహాయ కార్యదర్శి కె.దుర్గారావు కోశాధికారిగా పి.రత్నరాజు, సభ్యులు వి.శ్రీనివాస్ బి.నాగేశ్వ రరావు సీహెచ్ దిలీప్‌కుమార్ 15 మందితో కమిటీ ఏర్పడింది

## బీసీ నవ చైతన్య జిల్లా కమిటీ ఎన్నిక

పెనుమంట్ర, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):బీసీ నవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శీలం వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు జిల్లాల్లో కమిటీలకు ప్రతినిధులను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అల్లాడి సూర్య భాస్కరరావు తెలిపారు. జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా తాళ్ళ కుమార్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా పెచ్చెట్టి వెంకట రమణ, జనరల్ సెక్రటరీగా ఉటౌడ ధనరాజ్, కోశాధికారిగా ముంగండి నాగ వర ప్రసాద్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22న చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్‌లు సాధించడమే లక్ష్యంగా విజయవాడలో ధర్నా కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగిందన్నారు. హలో బీసీ చలో విజయవాడ పేరుతో ఈ ధర్నా జరుగుతుందని తెలిపారు.

## కొల్లేరు కాంటూరు భూముల పరిశీలన



భూములు పరిశీలనలో పాల్గొన్న అధికారులు

నిడమర్రు డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొల్లేరు కాంటూరు భూముల్లో వ్యవసాయం చేయడానికి సిద్ధపడిన స్థానికులను ఫారెస్టు అధికారులు ఇటీ వల అడ్డుకున్నారు. అయితే ఆ భూముల ప్రస్తుత పరిస్థితిని పరిశీలి ంచాలన్న కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలకు అనుగుణంగా ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ భూములలో గతంలో సాగవుతున్న ఆనవాళ్ళను వాస్తవ పరిస్థి తులను పరిశీలించి నివేదిక సమర్పించనున్నారు. ఈపర్యటనలో నిడమర్రు తహసీల్దార్ దుర్గాప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బాబా ఆలయంలో దత్త జయంతి



ప్రత్యేక అలంకరణలో సాయి బాబా

కాళ్ళ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా నామస్మరణతో సీసలి గ్రామం మారుమ్రోగింది. గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్త జయంతిని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన మౌనీష్ చౌదరి సహకారంతో ఆలయాన్ని, సాయిబాబా వారిని అలంకరించారు. బాబా వారికి పంచామృత అభిషేకం, కాకడ హారతి, మహాసుదర్శన సహిత దత్త మూలమంత్రములతో హోమం, ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక దత్త వ్రతాలు చేశారు. అనంతరం సుమారు 5 వేల మందికి ప్రసాద వితరణ చేపట్టారు. ఏర్పాట్లను దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి పర్యవేక్షించారు.

**ఏలూరు కార్పొరేషన్:** నగరంలోని పలు డివిజన్లలో గల షిరిడీ సాయి మందిరాల వద్ద దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారపుపేటలోని శ్రీ షిరిడీసాయి ప్రేమ మందిర్ వద్ద ఆలయ వ్యవస్థాపకులు ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో దత్తాత్రేయస్వామికి 108 రకాల పదార్థాలతో నివేదనలు సమర్పించారు. బాబా వారికి, దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం వేళ జరిగిన పల్లకీ సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ పాల్గొనడంతో వీధుల్లో సందడి నెలకొంది.



మద్దిలో భజనలు చేస్తున్న హనుమద్ దీక్షధారులు (ఇన్‌సెట్‌లో) మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

## హనుమద్ దీక్షల విరమణ

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. వేలాది సంఖ్యలో హనుమాన్ మాలధారులు ఆలయం వద్ద భజనలు చేశారు. ఆలయం అంతా హనుమాన్ స్వాములతో నిండిపోయింది. ముందుగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సుమారు మూడు వేల మంది హనుమద్ దీక్షాధారులు భజనలు చేసి, మహా పూర్ణాహుతి అనంతరం ఇరుముడులను సమర్పించి హనుమత్ దీక్షలను విరమించారు. దేవస్థానానికి వివిధ సేవల రూపంలో రూ.3,75,775 ఆదాయం లభించినట్టు, సుమారు 5100 మంది భక్తులు నిత్యాన్నదాన సత్రంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ ఈవో చందన తెలిపారు. చింతపూడి గ్రామానికి చెందిన డోలక్ సుబ్బారావు భజన మండలిచే భక్తి సంకీర్తనలు జరిపారు.

## వశిష్ఠ గోదావరికి పంచ హారతులు



పెనుగొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):సిద్దాంతం వశిష్ఠ గోదావరి వద్ద హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలగా భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో జయవరపు వంశీ, లక్ష్మి దీప్తి దంపతులచే గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు. ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమకుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ సర్ప హారతులు వశిష్ట గోదావరికి ఇచ్చారు. పౌర్ణమి రోజున గోదావరి నదీమ తల్లికి సంధ్యాహారతిని ఇవ్వడం జరిగిందని సభ్యులు తెలిపారు.

## వాసవి ధామ్‌లో ప్రత్యేక పూజలు



వాసవి ధాంలో హోమాలు చేస్తున్న భక్తులు

పెనుగొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో 30 మంది దంపతులుచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాత పూజ, నగరేశ్వరుని రుద్రాభిషేకం, దంపతిపూజ, వాసవి హోమాల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీవారికి తిరువీధి సేవ



ద్వారకాతిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉభయదేవేరులతో చినవెంకన్నకు గురువారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన తిరువీధి సేవ భక్తులను అలరించింది. ఆళ్వార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతి ఇంటి ముందు భక్తులు స్వామివారికి హారతులు పట్టారు.

## శబరిమలకు మహా పాదయాత్ర



పోలవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రం నుంచి గురువారం పోలవరం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారణ చేసిన ఇద్దరు భక్తులు మహాపాదయాత్ర ప్రారంభించారు. నూతనగూడెం గ్రామానికి చెందిన తైలం చంద్రశేఖర్, సిద్ధన రాజా గురుస్వామి మహా పాదయాత్ర ప్రారంభించారు. పోలవరం నుంచి 42 రోజుల పాటు 1450 కిలోమీటర్ల మహాపాదయాత్ర చేస్తున్నట్లు పాదయాత్ర చేస్తున్న స్వాములు తెలిపారు.




విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న అధికారులు

## హోమియోపతి వైద్యాన్ని ముందుకు తీసుకెళ్లాలి: ఐజీ

పెంటపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హోమియోపతి వైద్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు ఏఎస్‌ఆర్ హోమియోపతి వైద్య కళాశాలలో గురువారం స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గ్యాడ్యుయేట్ విద్యార్థులు హోమియోపతిని శ్రద్ధగా అభ్యసించాలన్నారు. మరో అతిథి డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి షేక్ సికిందర్ బాషా మాట్లాడుతూ హోమియోపతి వైద్యంలో విద్యార్థులు ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ హోమియోపతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. కళాశాల చైర్మన్ ఆకుల విజయ్‌వర్ధన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్‌కుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పాలకొల్లు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం ఆగర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్. రవికుమార్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న ఫిర్యాదుతో జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి నారాయణ గురువారం హైస్కూల్‌కు వెళ్లి విచారించారు. అనంతరం ఉపాధ్యాయుడుని అధికారులు సస్పెండ్ చేశారు. కొంతకాలంగా విద్యార్థినులను అసభ్యకరంగా మాట్లాడటం, బ్యాడ్ టచ్ చేయడం వంటివి చేస్తుండడంతో మానసికంగా క్రుంగిపోతున్నారు. చివరకు విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.




బాధితుడికి సొమ్ము అందిస్తున్న యాచకురాలు

## యాచకురాలి నిజాయితీ

**దొరికిన రూ.36వేల నగదు పోలీసులకు అప్పగింత**

భీమడోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన 36 వేల రూపాయలను పోలీసులకు అప్పగించి తన నిజాయితీని నిలుపుకుంది ఓ యాచకురాలు. కాకినాడకు సమీపంలోని కొండయ్యపాలెంకు చెందిన జువ్వల సత్యనారాయణ ఇంటింటికి తిరిగి పాత దుస్తులు కొనుగోలు చేస్తుంటాడు. గురువారం భీమడోలు వచ్చిన సదరు వ్యాపారి ఆటో దిగుతుండగా 36 వేల రూపాయలు సొమ్మును పోగొట్టుకున్నాడు. కొంతదూరం వెళ్ళి సొమ్ములేకపోవడాన్ని గమనించి భీమడోలు పోలీసులను ఆశ్రయించాడు. ఆటో దిగి సొమ్ము పోగొట్టుకున్న సమయంలో భీమడోలు జంక్షన్‌లో తన చంటి బిడ్డతో బిక్షాటన చేస్తున్న గుండుగొలనుకు చెందిన తిరుమలశెట్టి కరణకు సొమ్ము దొరికింది. సొమ్ముకు ఆశపడకుండా ఆమె భీమడోలు పోలీసులకు అప్పగించింది. యాచకురాలు నిజాయితీని భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ మదీనా బాషా అభినందించారు.

## అభివృద్ధికి సహకరించండి



ఆచంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్, డైరెక్టర్ జనరల్ వినయ్ కుమార్ రాజవత్‌లను ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణలు కలిశారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే పితాని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు అశోక్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## బిల్లులు కావాలా.. లంచం ఇవ్వాల్సిందే..!

**రూ.లక్షన్నర తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈ**

కొయ్యలగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):'మీరు చేసిన పనులకు బిల్లులు కావాలా ? అయితే మాకు లంచం ఇవ్వాల్సిందే..! లేకుంటే మీ బిల్లులు రావు. రకరకాల కొర్రీలు వేస్తాం' ఇదీ గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ మురళీకృష్ణ, డీఈ రమేష్‌ల తీరు. దీంతో విసిగిపోయిన ఓ కాంట్రాక్టరు ఏసీబీ అధికారులను ఆశ్రయించి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపిన వివరాలివి.. కొయ్యలగూడెం మండలంలో కాంట్రాక్టర్ నల్లబోతు కోటేశ్వరరావు, జలజీవన్ మిషన్‌లో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చేశారు. రూ.70 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు సిబ్బందితో గురువారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో కొయ్యలగూడెం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కార్యాలయానికి వచ్చారు. కాంట్రాక్టర్ కోటేశ్వరరావు ఏఈ మురళీకృష్ణకు రూ.లక్ష, డీఈ రమేష్‌కు రూ.50 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వారిని విచారించి, విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని కోరారు. ఈ సందర్భంగా డబ్బుల విషయంలో ఈ అధికారులు తమను పీడిస్తున్నారని మరికొందరు కాంట్రాక్టర్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీఐలు బాలకృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

## ఏలూరు నగర కమిషనర్‌కు మెమో జారీ

ఏలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):బాపట్ల మున్సిపాల్టీలో కమిషనర్‌గా పనిచేస్తున్న కాలంలో భూసేకరణలో ఉన్న ఒక రోడ్డు(ప్రైవేట్ రోడ్డు) నిర్మాణం చేసిన విషయంలో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు కార్పొరేషన్ ప్రస్తుత కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్‌కు పుర పాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ గురువారం మెమో జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనల అతిక్రమణలపై 10 రోజుల్లో రాత పూర్వకంగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లేకపోతే మీపై చర్యలకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టులో ఏలూరుకు భానుప్రతాప్ బదిలీపై వచ్చారు.

## ఆసుపత్రుల్లో పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో సవరణ

- కొన్ని పోస్టులు జోనల్ పరిధి కావడంతో వాటి భర్తీ నిలిపివేత
- మిగిలిన పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు

ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) హెల్త్ ఇనిస్టిట్యూట్స్‌లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి కొన్ని పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ నంబరు 01/2025లో జారీ చేశారు. అయితే వీటిలో కొన్ని పోస్టులు జోనల్ పరిధిలో ఉండడంతో వాటిని నిలిపివేస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆ పోస్టులు భర్తీ చేయడం లేదని డీసీహెచ్ ఎస్ డాక్టర్ బి.పాల్‌సతీష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 2 నాటికి నోటిఫికేషన్ నంబరు 01/2025 ప్రకారం హాస్పిటల్స్‌లో పనిచేయడానికి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన కింది పోస్టుల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బయో మెడికల్ ఇంజనీర్-1, ఆడియో మెట్రిషియన్ ఆడియోమెట్రి టెక్నీషియన్ (ఏఎంటీ)-5, రేడియో గ్రాఫర్-3, ల్యాబ్ టెక్నీషియన్-1, థియేటర్ అసిస్టెంట్-4, ఆఫీస్ సబార్డినేట్-1, జనరల్ డ్యూటీ అటెండన్స్-11, ప్లంబర్-2, పోస్టుమార్టం అసిస్టెంట్-3 మొత్తం 31 పోస్టులు ఉన్నాయి.

తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ డైరెక్టర్ జారీ చేసిన సూచనల ప్రకారం, పూర్వ వెస్ట్ గోదావరి జిల్లా ఎంపిక కమిటీ ఛైర్మన్, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కాంట్రాక్ట్ ప్రాతికపదికన జోనల్ కేడర్ పోస్టుల కోసం పైన పేర్కొన్న నియామక నోటిఫికేషన్‌కు కింద అనుబంధాన్ని (నోటిఫికేషన్ 01/2025లోని క్లాజు 11 కింద) జారీ చేయాలని నిర్ణయించారని తెలిపారు. దీంతో బమో మెడి కల్ ఇంజనీర్-1, ఆడియో మెట్రిషియన్ ఆడియోమెట్రి టెక్నీషియన్ (ఏఎంటీ)-5, రేడియోగ్రాఫర్-3 మొత్తం 9 పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులకు తుది మెరిట్ జాబితాలు అన్ని అభ్యర్థనలు, ఫిర్యాదులను పరిష్కరించిన తర్వాత జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లలో త్వరలో ప్రచురిస్తామని డీసీహెచ్‌ఎస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# బస్సు ఆపండి..

- కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థుల ఆవేదన
- అదనపు బస్సు సర్వీసు కోసం కూచింపూడిలో బస్సును అడ్డుకుని విద్యార్థుల నిరసన



కూచింపూడిలో బస్సును ఆపి నిరసన తెలుపుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) విద్యార్థులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సరిపడా బస్సు సర్వీసులు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎగువున రంగాపురం నుంచి వచ్చే బస్సు దిగువున ఉన్న గ్రామాలకు వచ్చే సరికి నిండుగా ప్రయాణికులు ఉండడంతో బస్సు ఆగకుండా వెళ్లిపోవడంతో కాలేజీలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామంటూ విద్యార్థులు గురువారం ఉదయం కూచింపూడిలో బస్సును ఆపి, ఆందోళనకు దిగారు. ఏలూరు నుంచి పెదవేగి, కూచింపూడి, రామశింగవరం మీదుగా రంగాపురానికి ఆర్టీసీ ఎదురెదురుగా రెండు బస్సులను నడుపుతోంది. ఉదయం కాలేజీలకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరిగి వచ్చే సమయంలో బస్సులు ఖాళీలేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఉదయం సమయంలో నిండుగా వస్తున్న బస్సును కూచింపూడి, పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల్లో నిలుపుదల చేయడంలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

### పలుమార్లు వినతి పత్రాలు అందజేత

ఆటోలో వెళ్లడానికి వ్యయం ఎక్కువ అవుతుందని, సమయానికి కాలేజీలకు చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన సమయమంతా బస్సులకోసం ఎదురుచూడడంలోనే గడిచిపోతుందని ఈ విషయమై ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇతర ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించి సమస్య పరిష్కరించాలని కోరామని, ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రంగాపురంనుంచి గోపన్న పాలెం మధ్య వున్న 15గ్రామాలకు రెండు బస్సులు మాత్రమే ఉండ డంతో ముందుగా వచ్చే గ్రామాల్లోనే బస్సు నిండిపోవడంతో ఆపై దిగువ గ్రామాల ప్రజలు బస్సు ఎక్కడానికి కష్టమవుతోంది. ఇటీవల కాలంలో స్త్రీశక్తి పథకంతో మహిళలు ఎక్కువగా బస్సు ప్రయాణం చేస్తున్నారు. ఇన్ని గ్రామాలకు రెండు బస్సులు ఏవిధంగా సరిపోతాయో ఆర్టీసీ అధికారులే ఆలోచించాలన్నారు.

### గత అక్టోబరులోనూ నిరసన..

కళాశాలలకు వెళ్లే విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఉదయం, సాయంత్రం వేళల్లోనైనా అదనపు సర్వీసులను తిప్పాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. గత అక్టోబరు 14వ తేదీన ఒకసారి బస్సును ఆపి, విద్యార్థులు నిరసన వ్యక్తంచేశారు. ఆ సమయంలో అదనపు సర్వీసు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. మరోసారి గురువారం ఉదయం బస్సును ఆపి, ఆందోళనకు దిగారు. స్థానిక టీడీపీ నాయకుడు గిత్తా సత్యనారాయణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సమస్యను వివరించడంతో పరిష్కారానికి చర్యలు చేపడతామనడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

### కలెక్టర్‌కు చింతమనేని వినతి

ఏలూరు రూరల్ : పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం కూచింపూడిలో బస్సును అడ్డుకుని విద్యార్థులు నిరసన తెలిపారు. స్థానిక కూటమి నాయకుల ద్వారా విద్యార్థుల సమస్యను తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విద్యార్థులతో కలిసి ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. సరైన బస్సు సర్వీసు లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయాణ సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


హీరో, హీరోయిన్ సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

## ఏలూరులో మోగ్లీ చిత్రం యూనిట్ సందడి

- పడమరవీధిలో అమ్మవార్లకు పూజలు

ఏలూరు రూరల్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి) : సరికొత్త ప్రేమకథా చిత్రంగా 'మోగ్లీ' సినిమా తెరకెక్కిందని హీరో రోషన్ కనకాల అన్నారు. యాంకర్ సుమ రాజీవ్ కనకాల తనయుడు రోషన్ హీరోగా, సాక్షి హీరోయిన్‌గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మోగ్లీ చిత్రం ఈనెల 12న విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఏలూరు పడమర వీధిలో జరుగుతున్న గంగానమ్మ జాతరలో భాగంగా మేడలో కొలువై వున్న గంగానమ్మ, పోతురాజు బాబు, మహాలక్ష్మీ అమ్మవార్లను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోగ్లీ చిత్రం అఖండ విజయం సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. గంగానమ్మను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. మోగ్లీ చిత్రం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. ఈనెల 12వ తేదీన విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సినిమాలో తనది ఛాలెంజింగ్ రోల్ అని, ఎమోషన్‌తో కూడిన అందమైన ప్రేమకథ అని హీరోయిన్ సాక్షి తెలిపారు. అనంతరం కోలాటం ఆడి సందడి చేశారు.

## 7న 'రోడ్ రన్'కు సినీనటి పాయల్ రాజ్‌పుత్ రాక

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సంకల్పించిన ఫిట్ ఇండియా కార్యక్రమం 'తణుకు రన్నర్స్ సొసైటీ' భాగస్వామ్యంతో ఈనెల ఏడో తేదీన తణుకులో నిర్వహించే 'రోడ్ రన్ మారథాన్' కార్యక్రమానికి ఈవెంట్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న సినీ నటి పాయల్ రాజ్‌పుత్ విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. గురువారం తణుకులోని ఎమ్మెల్యే కార్యాలయంలో రోడ్ రన్‌కు సంబంధించిన టీ-షర్టులు, మెడల్స్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఏడో తేదీన ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ రన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో ఈ రోడ్‌రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటివరకు రెండు వేల మంది రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నట్లు తెలిపారు. ఈనెల 6న తణుకు ఎన్టీయార్ పార్కులో స్పాట్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రోడ్ రన్ నిర్వాహకులతో పాటు ఏఎంసీ చైర్మన్‌లు కొండేటి శివ, దాసం ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


తణుకులో రోడ్ రన్ కార్యక్రమం టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

### సీతారామస్వామి దేవస్థానానికి చెందిన

## రూ.20 కోట్ల విలువైన భూమి స్వాధీనం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ గోకుల తిరుమల పారిజాత గిరి దేవస్థానం ఆర్చి పక్కనే ఉన్న సీతారామ స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 121/2లోని రూ.20 కోట్ల విలువైన 9 ఎకరాల 41 సెంట్ల కొబ్బరి తోటను దేవదాయ శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు.గత అరవై ఏళ్ళుగా పట్టణానికి చెందిన ఓ కుటుంబం ఆక్రమణలో ఉన్న సీతారామస్వామి వారి భూమిని దేవాదాయ శాఖ అధికారులు దేవాదాయ,ధర్మాదాయ శాఖ చట్ట ప్రకారం దేవాదాయ శాఖ జిల్లా అధికారి కూచిపూడి శ్రీనివాస్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు గోకులపారిజాతగిరి దేవస్థాన ఈవో.కలగర శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు దేవస్థాన ఈవోలు ఏ.రవిశంకర్,జి.పవన్‌కుమార్, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు, పారిజాతగిరి సిబ్బంది పాల్గొన్నారు.


భూమిని స్వాధీనం చేసుకుంటున్న దేవదాయ, రెవెన్యూ అధికారులు

## కుటుంబ కలహాలతో ఇద్దరి ఆత్మహత్య

**భర్త మద్యం మానడం లేదని అడవికొలనులో భార్య..**

**భార్య తిట్టిందని రాజుపోతేపల్లిలో భర్త..**

నిడమర్రు/టి.నరసాపురం/ఏలూరు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లోని ఇద్దరు భార్యలు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివి.. నిడమర్రు ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడమర్రు మండలం అడవికొలనుకు చెందిన పిల్లి తవిటయ్యకు మద్యం తాగేందుకు గత నెల 19 రాత్రి భార్య చిన్నిలక్ష్మి(46)ని డబ్బులు అడిగాడు. దీనికి ఆమె మద్యం అలవాటు మానకపోతే తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ పురుగుల మందు తాగింది. వెంటనే పక్కనున్న వారు 108 కు ఫోన్ చేసి ముందుగా తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం క్షీణించడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం ఉదయం మరణించింది. కుమారుడు వెంకట రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లికి చెందిన కనుమూరి రాయప్ప(60) మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా కుటుంబ అవసరాలు పట్టించుకోకుండా తిరుగుతూ బుధవారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య మందలించడంతో కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదుతో ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేశారు.

### ఫెర్రీ రేవులో గుర్తు తెలియని మృతదేహం

పోలవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):పోలవరం మండలం పట్టిసీమ ఫెర్రీ రేవులో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గోదావరి రేవులో కనుగొన్న జనసేన ప్రధాన కార్యదర్శి కాకి అయ్యప్ప, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్టేషన్ రైటర్ భీమశంకర్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని మృత దేహంపై నీలిరంగు చొక్కా, ఖాకీ రంగు ప్యాంటు కలిగి ఉన్నారని, ఆచూకీ తెలిసిన వారు 94929 16617 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.



# ఏలూరులో ఏదీ భద్రత

## నగరంలో అల్లరిమూకల అలజడి

- తెల్లవార్లు తెరిచి ఉంటున్న హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, కిళ్లీ షాపులు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రాత్రి గస్తీ పోలీసులు



ఏలూరు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ఇటీవల అల్లరిమూకల ఆగడాలు పెరిగిపోయాయి. పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులకు వెళ్లడం, ఇదే అదనుగా తీసుకున్న అల్లరి మూకలు, రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. ఏలూరు నగరంలో రాత్రి వేళల్లో హోటల్స్, రెస్టారెంట్లు తెల్లవార్లు బార్లా తెరిచి ఉండడంతో అల్లరిమూకలకు ఆవాసాలుగా మారాయి. నగరంలో చక్కర్లు కొడుతూ ఆ ప్రాంతాలకు వెళ్లి అక్కడే ఉంటున్నారు.

అర్ధరాత్రి వేళ బస్టాండ్లు, ప్రభుత్వాసుపత్రి, అజంతా సెంటర్, తంగెళ్లమూడి ప్రాంతాల్లో అల్లరి మూకలు చేరి ఆగడాలు సృష్టిస్తున్నారు. కొన్ని బ్రాందీషాపులు రాత్రి వేళ సమయానికి మించి తెరచి ఉంచి మద్యం విక్రయాలు వెనుక నుంచి జరపడంతో మద్యం కొనుగోలు చేసుకోవడం సమీపంలోని బిర్యానీ పాయింట్లకు వెళ్లడం ఆపై పూటుగా మద్యం తాగి దారి వెంబడి వెళ్లే వారిపై దాడులకు తెగబడుతున్నారు. రాత్రి వేళ సెకండ్ షో సినిమా చూసి వచ్చే వారిని బెదిరిస్తున్నారు. పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద, శనివారపుపేటలో బ్రిడ్జి సమీపంలో మద్యం బాబులు రోడ్లపైన మద్యం తాగుతూ కనీసం వెళ్లే వారికి దారి కూడా ఇవ్వడం లేదు. దీంతో బాటసారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇద్దరు రౌడీలు ఒంటరిగా ఇంట్లో ఉన్న ఇద్దరు యువతులను బెదిరించిన అత్యాచారానికి పాల్పడ్డారంటే నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవచ్చు. కొంత మంది రౌడీలు తెలిసో తెలియకో చేసిన తప్పులను తెలుసుకుని ఎంతో క్రమశిక్షణ కల్గి తమ వృత్తులను కొనసాగిస్తూ సమాజంలో గౌరవంగా జీవిస్తున్నారు. కానీ అల్లరిమూకలు వివిధ కేసుల్లో ఉన్న వారే ప్రస్తుతం రౌడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ఏలూరు రూరల్ ప్రాంతంలో ఇటీవల అల్లరి మూకల కార్యకలాపాలతో హత్యలు చోటు చేసుకున్నాయి. వేధింపులు భరించలేక భయభ్రాంతులకు గురై ఆ ప్రాంతలను వదిలి వెళ్లిన వారు ఉన్నారు. రాత్రి వేళ కొందరు బీటు పోలీసులు కిళ్లీ షాపులు, బిర్యానీ పాయింట్ షాపులు, కొన్ని రెస్టారెంట్లను మూయించకుండా చూసి చూడనట్లు వదిలివేయడంతో ఈ ప్రాంతాల్లోనే అల్లరి మూకలు చేరుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసిన వారు రాత్రి వేళ తమ ఇళ్లకు వెళ్లాలంటే నగరంలో భయభ్రాంతులకు గురికావాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ అల్లరిమూకల ఆగడాలకు కళ్లెం వేసి ప్రజలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## యువతిపై రౌడీషీటర్ అర్ధరాత్రి అత్యాచారం

**సహకరించిన మరో రౌడీ షీటర్**

ఏలూరులో అర్ధరాత్రి వేళ ఇంట్లో వున్న ఇద్దరు యువతులను ఇద్దరు రౌడీషీటర్లు టార్గెట్ చేసి ఒకరిపై అత్యాచారానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లాలో ఒక గ్రామానికి చెందిన యువతి(23) తండ్రి మరణించాడు. ఆమె తల్లితో గొడవపడిన ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతి వద్దకు వచ్చింది. 2వ తేదీ రాత్రి వారు ఇద్దరూ ఇంట్లో ఉండగా ఏలూరుకు చెందిన రౌడీ షీటర్లు పులిగడ్డ జగదీష్‌బాబు, లావేటి భవానీకుమార్ మద్యం తాగి ఆ యువతులు ఉన్న ఇంటికి వెళ్లి తలుపులు బాదుతూ భయభ్రాంతులకు గురిచేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చిన యువతి తలుపు తీయగా ఆమెను కొట్టుకుంటూ సమీపంలోని సచివాలయానికి తీసుకువెళ్లి జగదీష్ బాబు అత్యాచారం చేశాడు. కుమార్ మరో యువతి వద్ద ఇంట్లో ఉండి బెదిరించారు. తర్వాత రౌడీ షీటర్లు ఇద్దరూ అర్ధరాత్రి వెళ్లిపోయారు. మరో గంట స్నేహితులతో కలిసి వారు మళ్లీ వచ్చి యువతులను బెల్టుతో చావబాదారు. విషయం ఎవరికైనా చెబితే చంపివేస్తామని బెదిరించారు. ఉదయం ఆ యువతులు భయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా అక్కడ పోలీసులు పట్టించుకోలేదు. సమాచారం ఉన్నతాధికారులకు అందడంతో బాధితురాలిని ఒక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. ఆఘమేఘాల మీద చివరకు ఆ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## హత్యాయత్నం కేసులో ఏడుగురి అరెస్టు

### వైసీపీ నాయకుడే ప్రధాన నిందితుడు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిని చంపడానికి ప్రయత్నించిన ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.వీర ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరంపేటకు చెందిన వైసీపీ ఎంపీటీసీ భర్త, వైసీపీ నాయకుడు ఇర్ల శ్రీనివాసరెడ్డికి అదే గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కలపాల కోటయ్యకు పాత గొడవలున్నాయి.ఈ నేపథ్యంలో కోటయ్యను హత్య చేయాలని భావించిన శ్రీనివాసరెడ్డి ఓ పథకం రచించాడు. అందుకోసం జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కొందరు ఎస్సీ యువకులను ఎంచుకున్నాడు. డిసెంబరు ఒకటో తేదీన పేరంపేట పొలంలో ఉన్న కోటయ్యపై దాడి చేయడానికి ఐదుగురు వ్యక్తులను పంపించాడు. వారు కోటయ్యను కర్రతో తలపై కొట్టి దాడి చేశారు. ఆ సమయంలో కోటయ్య వారి నుంచి తప్పించుకుని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకున్నాడు. ఆసుపత్రి సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు మొదట కొట్లాట కేసుగా నమోదు చేశారు. విచారణ చేసిన తరువాత హత్యాయత్నం కేసుగా మార్పు చేసి ప్రధాన నిందితుడు ఇర్ల శ్రీనివాసరెడ్డితో పాటు పాపదాసు రమేశ్ రెడ్డి, దిర్సిపాము ప్రసాద్, కొల్లి మురళీకృష్ణ, ముళ్ళపూడి భాను ప్రసాద్, మద్దిపాటి శ్రీను, యడ్లపల్లి యుగంధర్ లను అరెస్ట్ చేశారు. ఏ-1 గా ఉన్న ఇర్ల శ్రీనివాసరెడ్డి నిందితుల్లో ఒకడైన పాపదాసు రమేశ్ రెడ్డితో కలిసి ఈ పథకం రచించినట్లు పోలీసులు నిర్ధారించారు. రమేశ్ రెడ్డి నిందితుల్లో ఒకడైన డి.ప్రసాద్‌కు రూ.34వేల నగదు జమ చేసినట్లు తెలియచేశారు. కోటయ్యను పథకం ప్రకారం చంపడానికి ప్రయత్నించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఏడుగురిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.


గంజాయిని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన పోలీసులు

## 595 కేజీల గంజాయి ధ్వంసం

భీమవరం క్రైం, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 595 కేజీల గంజాయిని పోలీసులు గురువారం ధ్వం సం చేశారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు కాబడిన 21 కేసుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం 595 కేజీల గంజాయిని గురువారం గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పరిధిలో గల జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ వద్ద ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీతోపాటు జిల్లా అదనపు ఎస్పీ భీమారావు, నరసాపురం డీఎస్పీ శ్రీవేద సభ్యులుగా ఉన్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ, మధ్యవర్తుల కమిటీ ఆధ్వర్యంలో ఈ ధ్వంసం ప్రక్రియ నిర్వహించామన్నారు. ధ్వంసం చేయబడిన గంజాయిని ముందుగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మధ్యవర్తుల సమక్షంలో కేసుల వారీగా తూకం వేసి పరిశీలించి సీలు వేయడం జరిగిందని, పకడ్బందీ బందోబస్తు మధ్య గుంటూరు తరలించామన్నారు. ధ్వంసం చేయడానికి సహకరించిన కంపెనీ ప్రెసిడెంట్ ఎంవీ చారి, అధికారులకు జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## 45 ఆవులతో ఐషర్ వాహనం పట్టివేత

దెందులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా లారీలో 45 ఆవులను తరలిస్తున్న ఐషర్ వ్యాన్‌ను జాతీయరహదారిపై కొవ్వలి వంతెన వద్ద గోరక్షకుల యువత పట్టుకున్నారు. గోవులతో వస్తున్న వాహన సమాచారం తెలుసుకున్న యువత పోలీసులకు తెలియజేశారు. గోవులతో వున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని దెందులూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేశామని దెందులూరు ఎస్సై శివాజీ తెలిపారు.

## పశువుల వ్యాన్ పట్టివేత

ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా వరాడ గ్రామానికి చెందిన గొల్లా త్రిమూర్తులు అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఆవులను, గిత్తదూడలను కొనుగోలు చేసి వాటిని హనుమాన్‌జంక్షన్‌లోని పశువుల సంతలో విక్రయించడానికి గురువారం వ్యానులో తీసుకువెళ్తున్నాడు. ఆశ్రం ఆసుపత్రి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగబాబు వాహనాలకు సంబంధించిన రికార్డులను, పశువుల రవాణాకు సంబంధించిన ధృవపత్రాలను అడుగగా చూపించలేకపోయాడు. దీంతో అక్రమంగా ఆవులను రవాణా చేస్తున్నాడని గుర్తించి గొల్లా త్రిమూర్తులను అరెస్టు చేసి పది ఆవులు, నాలుగు గిత్త దూడలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోడి వ్యర్థాల వ్యాన్ పట్టివేత

ఏలూరు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):కోడి వ్యర్థాలను చేపల చెరువులో వేయడానికి తీసుకువెళ్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి కోడి వ్యర్థాల వ్యానును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీపర్రు గ్రామానికి చెందిన జూలూరి రమేష్ భీమవరం ప్రాంతంలో కోడి వ్యర్థాలను చికెన్ షాపుల నుంచి సేకరించి వాటిని శ్రీపర్రు గ్రామంలోని చేపల చెరువల యజమానులకు విక్రయించడానికి గురువారం ఉదయం తీసుకువస్తుండగా ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగబాబు తన సిబ్బందితో తనిఖీలు చేసి రమేష్‌ను అరెస్టు చేశారు.

## ఏలూరులో జాతర సందడి

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని తూర్పువీధి, పడమరవీధి, దక్షిణపువీధి, పవరుపేట, ఆదివారపుపేట, తంగెళ్ళమూడి ప్రాంతాల్లో జాతరకు ముడుపుల కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. నిరంతరం నగరంలో డప్పు వాయిద్యాలు, ఘణాచార్యులు, జాతర ప్రతినిధులు సంచారాలతో సందడి నెలకొంది. వీధివీధిన జాతర ప్రతినిధులు ఘణాచార్యులతో, మేళతాళాలతో తరలిరావడంతో ప్రతీ ఇంటి వద్ద ఈ బృందానికి స్నానోత్సవాలు నిర్వహించి హారతులు పట్టారు.

## 16 నుంచి ధనుర్మాసోత్సవం.. 27 నుంచి బ్రహ్మోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 16నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు, ప్రతీరోజూ పారాయణలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి, ఈవో నల్లూరి సతీష్‌కుమార్‌లు తెలిపారు. 27వ తేదీ నుంచి జనవరి 17 వరకు శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## పోలవరం సమస్యలపై మంత్రికి వినతి

పోలవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును గురువారం సందర్శించిన రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు పోలవరం కూటమి నేతలు మండలంలోని పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. మండలంలో ఇసుక కాలువకు గడిచిన వర్షాలకు పడిన గండ్లు పూడ్చివేత, శాశ్వత మరమ్మతులు, కడెమ్మ కాలువ పూడికతీత, జంగిల్ క్లియరెన్సు, మంగళవారి కురివిడి, జోడిమళ్ళ కురివిడి, కత్రిపంపు బోదె చెక్‌డ్యాం నిర్మాణం పనులు, కృష్ణారావుపేట బాడవ రోడ్డు నుంచి గాడాల చెరువుకి రోడ్డు పొడిగింపు, కామాయమ్మ తూము మరమ్మతులు, కొత్తూరు చెరువు పూడికతీత, గట్టు గ్రావెల్ రోడ్డు నిర్మాణం, జంగిల్ క్లియరెన్సు పనులకు నిధులు మంజూరు, కన్నాపురం అడ్డరోడ్డు వద్ద నిలిచిన పట్టిసీమ నూతన పంపింగ్ స్కీం నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతులు అందించిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు మంగిన కొండ, కొత్తూరు చెరువు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, పట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు నునకాని రాంబాబు, నల్లా రాంబాబు, బెజవాడ గోపి, ఆకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

**మంత్రికి స్వాగతం :** ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్న మంత్రి నిమ్మల రామానాయుడికి ప్రాజెక్టు ఇంజనీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు, అండ్‌ఆర్ కమిషనర్ ప్రశాంతి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్, మేఘా ప్రతినిధులు అంగర సతీష్, గంగాధర్, ఆర్డీవో వెంకటరమణ, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, మంగిన కొండ, ఆకుల రాజా పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## 10న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న ఏపీ రైతు సంఘం, సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించినట్టు సీపీఐ జిల్లా నాయకులు మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావులు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నాయకులు సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. 13న ఏలూరులో జరుగుతున్న రాష్ట్ర భూ సదస్సును జయప్రదం చేసేందుకు అన్ని మండలాల నుంచి వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. 18న రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈనెల 20 నుంచి 26 వరకు సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. 26న సీపీఐ శత వార్షికోత్సవాన్ని శ్రేణులు జరపాలని కోరారు. కార్యక్రమంలో కారం దారయ్య, నిమ్మగడ్డ నరసింహ, తొర్లపాటి బాబు ఉన్నారు.



డీడీవో కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న నాయకులు

## మూడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం

ఏలూరుసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి 77డివిజనల్ అభివృద్ధి అధికారి(డీడీవో) కార్యాలయాలను వర్చువల్‌గా డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ గురువారం ప్రారంభించారు. వీటిలో జిల్లాకు చెందిన ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని ఏలూరు శనివారపుపేటలోని డీడీవో కార్యాలయంలో కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు వీక్షించారు. అనంతరం ఏలూరు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కార్యాలయాలన్నీ ఒకే చోటకు చేర్చడం వల్ల పరిపాలనా సౌలభ్యంతో పాటు ప్రజలకు మంచిమేలు జరిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ శాఖ కమిషనర్ ఓఎస్డీ , జిల్లా నోడల్ అధికారి కె.ఆనంద్, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవో కె.భీమేశ్వర్, డ్వామా ఏపీడీ ఆర్.విక్టర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీడీవో ఏటీపీవీ లక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, సంబంధిత శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెంలో..**

జంగారెడ్డిగూడెం : పంచాయతీరాజ్ కార్యాలయం పక్కన ఉన్న డీడీవో కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు తదితర కూటమి నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం పలు గదులను నాయకులు ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీడీవో.ఎం.రాజు, డ్వామా అధికారి దామోదర్, డీఎల్‌పీవో.సుబ్బరాయన్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా...

(5వ పేజీ తరువాయి)

ఇచ్చేందుకు ముందుకొచ్చిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తాజాగా జీలుగుమిల్లిలో జరిగిన గ్రామసభకు సైతం పీఎన్ (ప్రాథమిక ప్రకటన)లో పేర్లు నమోదైన రైతులందరికీ రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహిస్తున్నట్టు సమాచారం ఇవ్వలేదన్నారు. సభ జరుగుతున్నట్టు సమాచారం తెలుసుకున్న కొందరు రైతులు హడావుడిగా సభకు వచ్చి తమ సమస్యలు తెలుపుకున్నారు. మరోవైపు అన్నదమ్ముళ్ల మధ్య పంపకంలో తేడాలు ఉండి పార్టివేషన్ డీడ్ లేని భూములను సైతం అధికారులు భూసేకరణలో ఉంచారని కొందరు రైతులు వాపోతున్నారు. పీఎన్‌లో సర్వే నెంబర్లు తప్పుగా నమోదైన వాటిని సరిచేయాలని, రికార్డులు సక్రమంగా లేని భూముల్ని పరిశీలించాలని విన్నవించారు. అయితే అటువంటి విషయాలు కోర్టులో తేల్చుకోవాలని అధికారులు చెబుతున్నారని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామసభ నిర్వహించే విషయమై రైతులకు సమాచారం లేదన్న విషయమై ఎస్‌డీసీ డి.చంద్రశేఖర్‌ను వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వీఆర్వో రామతులసిని వివరణ అడగ్గా గ్రామసభ ఏర్పాటు విషయమై రైతులకు నోటీసులు పంపామన్నారు. అయితే కొందరు రైతులు తమకు ఏ నోటీసులు అందలేదని చెప్పడం గమనార్హం. సమావేశంలో సర్పంచ్ చిర్రి జగదాంబ, రెవెన్యూ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## స్మార్ట్‌గా..సూక్ష్మసేద్యం!

(5వ పేజీ తరువాయి)

చొప్పున రూ.22 వేలు మంజూరు చేస్తారు. ఇతర రైతులకు 45 శాతం రాయితీ చొప్పున రూ.18 వేలు ఇస్తారు. ఆటోమేషన్ అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొన్నేళ్లుగా సూక్ష్మసేద్యం చేస్తున్నవారు వైర్‌లెస్ ఆటోమేషన్‌కు అమర్చుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే నిబంధనలకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాలను పొందాలనుకునేవారు ఆటోమేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. స్టార్టర్లు, వాల్వ్ ఆన్, ఆఫ్‌తో పాటు ఇతర సెన్సర్ పరికరాలకు రైతులు అమర్చుకోవచ్చు. హెక్టారుకు గరిష్ఠంగా యూనిట్ విలువ రూ.40వేలుగా పరిగణించి.. అందుకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. ఆటోమేషన్ పరికరాలకు కనీసం ఏడాది వారంటీ ఉండాలని నిబంధనల్లో పేర్కొంది.

## నల్లికాటు..జ్వరం పోటు!

(5వ పేజీ తరువాయి)

కుటుంబ సంక్షేమశాఖ/ ఎన్‌హెచ్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ల్యాబ్‌ను మెడికల్ డైరెక్టరేట్ (డీఎంఈ)కి బదలాయించడంతో నిర్వహణ జీజీహెచ్ చేతుల్లోకి వెళ్లింది. ప్రస్తుతం మూతపడిన ఈ ల్యాబ్‌లో హెపటైటిస్, డెంగీ, మలేరియా, కొవిడ్ వేరియంట్లు, స్క్రబ్ టైఫస్‌వంటి రోగాల బారిన పడిన రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను విశ్లేషించేందుకు వినియోగించే 9 ఆర్టీపీసీఆర్ మిషన్లు, 2 బయోస్టైమ్‌లు, 3 ఆటోమేటెడ్ మిషన్లు, రసాయనాలు, కిట్లువంటి రూ.2.50 కోట్ల విలువైన ల్యాబ్‌సామగ్రి నిరుపయోగంగా పడి ఉంది. సాధారణ రోజుల్లో ఈ ల్యాబ్‌కు రోజుకు సగటున 10 వరకు శాంపిల్స్ విశ్లేషణ, రోగ నిర్ధారణ నిమిత్తం వస్తుండేవి. తాజాగా స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగులోకి వస్తున్న వేళ ఇకనైనా ఈ ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్‌ను పునఃప్రారంభించడానికి తక్షణ చర్యలు అవసరం.

# ప్రతిపాదనలు పంపండి

**ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు**

**కొయ్యలగూడెం మునిసిపాల్టీ, నూతన పంచాయతీల కోసం ఇటీవల వినతులు..**

కొయ్యలగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండలంలో నూతనంగా పంచాయతీలు, మునిసిపాల్టీ ఏర్పాటు చేయాలంటూ ఇటీవల అందజేసిన అర్జీలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నివేదిక కోరింది. డిప్యూటీ సీఎంకు అర్జీలు అందజేసిన నేపథ్యంలో ప్రభుత్వం నివేదిక కోరడం పట్ల స్థానిక నాయకులు, అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు కొత్తపంచాయతీలు, ఒక కొయ్యలగూడెం మున్సిపాల్టీకి ఏర్పాటుకు స్థానికులు ఎప్పటి నుంచో విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే ఇటీవల పవన్‌కు అర్జీ అందజేయడంతో నివేదిక కోరింది. అధికారులు నివేదికలను పంపేందుకు కసరత్తు చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఆమడ దూరంలో ఉన్న కొయ్యలగూడేన్ని మున్సిపాలిటీ చేస్తే అన్ని విధాల అభివృద్ధికి ఆస్కారం ఉంది. పోలవరం నియోజకవర్గంలో అతిపెద్ద మండల కేంద్రమైన కొయ్యలగూడేనికి మున్సిపాల్టీ అయ్యే అన్నియోగ్యతలు ఉన్నాయంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వంలోనూ ప్రతిపాదనలు వెళ్లాయి. అప్పట్లో నాయకులు ఈ విషయాన్ని గాలికి వదిలేసింది. ఇటీవల పవన్ కల్యాణ్ ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం పర్యటనకు వచ్చినప్పుడు కొయ్యలగూడేన్ని మున్సిపాల్టీ చేయాలని వివిధ పంచాయతీలో దూరంగా ఉన్న గ్రామాలను ప్రత్యేక పంచాయతీలు చేయాలని విన్నవించారు. దీంతో పవన్‌కల్యాణ్ దీనిపై దృష్టి సారించారు. మండలంలోని యర్రంపేట పంచాయతీలో ఉన్న తిమ్మనకుంట, గంగన్నగూడెం, ఏడువాడలపాలెం గ్రామాలను ఒక పంచాయతీగా, రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరం, మంగపతిదేవిపాలెం, గ్రామాలను ఒక పంచాయతీగా, దిప్పకాయలపాడు, సరిపల్లె గ్రామ పంచాయతీల్లో ఉన్న గిరిజన గ్రామాలను ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. దీంతో కొయ్యలగూడెం మండలంలో మూడు కొత్తపంచాయతీలు ఏర్పడనున్నాయి. మండలం నుంచి ఈ మూడు పంచాయతీలకు కొయ్యలగూడెం మున్సిపాల్టీకి ప్రతిపాదనలు పంపమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ఏలూరుటూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరార్థం ఆర్థిక చేయుతనందిచేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 22 మందికి 13 లక్షల 81వేల విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఇప్పటి వరకు 385 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్యం అందించామన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. అనంతరం పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ఏలూరురూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిషేధానికి, ప్రజలు సమిష్టి కృషి చేయాలని క్రాఫ్ట్ కోఆర్డినేటర్ వినోద్ పిలుపునిచ్చారు. గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా వందరోజుల అవగాహనలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలు లేని భారత దేశ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కొవ్వొత్తులు వెలిగించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, క్రాఫ్ సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

బుట్టాయగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మన్యం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ కోర్స గంగరాజు, కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. కోర్సవారిగూడెం పంచాయతీ పరిధిలోని ఆరు గిరిజన గ్రామాలు ఉండగా అన్ని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారని వారి భాగస్వామ్యంతో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. చెత్తను సేకరించడానికి ఎటువంటి రుసుం వసూలు చేయడం లేదన్నారు.

## సీఆర్పీల సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా అభియాన్‌లో 12ఏళ్లుగా పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల(సీఆర్పీ/సీఆర్‌ఎంటీ)కు కనీస వేతన స్కేలు ఇవ్వాలని, విద్యాశాఖలో తమ ఉద్యోగాలను విలీనం చేసి రెగ్యులర్ జీతభత్యాలను చెల్లించాలని అభ్యర్థిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు ఎంఈవోలు రవిప్రకాష్, అరుణ్ కుమార్‌లకు వినతిపత్రాలను వేర్వేరుగా అందజేశారు. సంఘ నాయకులు రాంబాబు, దివ్య సునీత, సంధ్య, లీలావతి, స్పందన పాల్గొన్నారు.

●లింగపాలెం: మండలంలోని సీఆర్‌ఎంటీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లింగపాలెం మండల విద్యాశాఖ అధికారులు కేవీ దుర్గారావు, రవీంద్ర తహసీల్దార్ నజీముల్లాషాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2012వ సంవత్సరం నుంచి పనిచేస్తున్న సీఆర్‌ఎంటీలో 2016 పేస్ ప్రకారం జీతాలు చెల్లిస్తున్నందున పెరిగిన జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని జీతాలు పెంచాలని ఎంటీఎస్, లేదా హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు పీఆర్టీ నాయకులు పూల ఆంజనేయులు, యూటీఎఫ్ నాయకులు జంగా జయసింహ, ఎస్టీయూ నాయకులు జీటీ స్వామి, సీఆర్‌ఎంటీల నిరసనకు మద్దతు పలికారు. కుమార్ మంగళం, టి.కనకరాజు, టి.సునీత పాల్గొన్నారు.

## విజిలెన్స్ కమిటీ సభ్యుల అసహనం

కామవరపుకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట పంచాయతీలోని కొండగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ గురువారం ఉదయం 11.30 గంటలకు పరిశీలించగా పిల్లలు ఎవరూ లేకపోవడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. పిల్లలకు ఇవ్వాల్సిన గుడ్లు, పాలు పంపిణీ చేయకపోవడం, వంట కూడా చేయకపోవడంతో కేంద్రంలో సరుకులు, కూరగాయలు లేకపోవడం, పిల్లలు ఉండాల్సిన చోట మంచం వేసి ఉండడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించారు. పిల్లలు వచ్చిన తరువాత వంట చేస్తామని చెప్పడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అంగన్‌వాడీ కేంద్రంపై ఉన్నతాధికారులకు తాను నివేదిక పంపిస్తానని స్పష్టం చేశారు.

## పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొయ్యలగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్.ఐ.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని బయ్యన్నగూడెంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని

## లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

దెందులూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ అర్హులైన దివ్యాంగులకు చెందాల్సిన పింఛన్ సొమ్మును అనర్హులకు ఇచ్చారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 32 మంది ఎన్టీఆర్ భరోసా పథకంలో పింఛన్ పొందుతూ చనిపోయిన వారి స్థానంలో వితంతువులకు రూ.4 వేలు చొప్పున 30 మందికి, ఇద్దరి కిడ్నీ బాధితులకు రూ.10 వేలు చొప్పున నూతనంగా మంజూరైన పింఛన్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని అందజేశారు. ఎంపీడీవో వీరప్రతాప్, తాతా సత్యనారాయణ, టీడీపీ నాయకులు ముమ్మడి మోహన్‌రావు సంపంగి వేణుగోపాల తిలక్, ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగించుకోవాలి

భీమడోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మత్స్య సంపద అభివృద్ధి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ మండల అధికారి ఎస్.దుర్గాభవాని అన్నారు. కురెళ్లగూడెంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేకోవాలన్నారు.

## భూముల సమస్యలు పరిష్కరిస్తాం

పెదవేగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 22ఏ భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు ఉన్నాయని, దీంతో ఆ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం లేకపోయిందని పలువురు రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన నిషేధిత 22ఏ భూములపై దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రైతుల భూముల విముక్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. దీనికోసం రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో త్వరలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభాకర్ తెలిపారు.

## ఘనంగా ఘంటసాల జయంతి

చింతలపూడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పాతబస్టాండ్ వద్ద అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుక ఆయన అభిమానులు గురువారం నిర్వహించారు. ముందుగా ఘంటశాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అభిమాన సంఘ నాయకుడు వి.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ త్వరలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అభిమానులు కొప్పూరి కృష్ణ, ముళ్లగిరి ఇమ్మానియేలు, ఆచారి, పొట్టి సత్యనారాయణ, బావాజీరాజు పాల్గొన్నారు.

## నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీ సీజ్

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా కలప రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీని ఏఎస్పీ సుస్మి తారామనాథన్ సీజ్ చేసినట్టు ఎస్.ఐ. ఎన్.వీర ప్రసాద్ తెలిపారు. ద్వారకాతిరుమల మండలం గాలాయగూడెం నుంచి కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం బ్యారన్ల వద్దకు ఈ కలప తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.



మొదలు పెట్టిన రోడ్డు పనులు

## బయ్యన్నగూడెం రోడ్డుకు మోక్షం

కొయ్యలగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బయ్యన్నగూడెం, సరిపల్లి రోడ్డుకు మోక్షం కలిగింది. దీనిలో భాగంగా గురువారం ఆ రోడ్డుకి పనులు మొదలుపెట్టారు. గత 25సంవత్సరాలుగా ఈ రోడ్డుకి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రహదారికి మూడు కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఈ రహదారి పనులు మొదలయ్యాయి. త్వరలోనే ఎంపీ, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంకుస్థాపన చేపట్టి పనులు మొదలుపెడతారని మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్ తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

లింగపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం శివారు కాటంరెడ్డిపల్లిలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లై డ్యూటీ దుర్గాప్రసాద్, ఎస్ఐ కే వెంకన్న తెలిపిన వివరాలు ప్రకారం కాటంరెడ్డిపల్లిలో రూ.రెండు లక్షల 35వేల విలువైన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సివిల్ సప్లై డిటి దుర్గాప్రసాద్, ఎస్ఐ వెంకన్న దాడి చేసి పట్టుకున్నారు.

## అంకిత భావంతో పనిచేసేవారికి గుర్తింపు



నాగలక్ష్మిని సన్మానిస్తున్న సర్పంచ్

టి.నరసాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని బండివారిగూడెం సర్పంచ్ నాళం టిరీషా కాశీ అన్నారు. స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై గ్రామ, వార్డు సచివాల యాల డిప్యూటీ ఎంపీడీవోగా వెళ్లిన ఎల్.నాగలక్ష్మిని టిరీషా, కాశీ దంపతు లు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత నాగలక్ష్మి మాట్లాడుతూ సచి వాలయాల అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలను చేరువ చేసేలా పని చేస్తానన్నారు. ఉద్యోగోన్నతి మరింత బాధ్యత ను పెంచిందన్నారు. బండి వారిగూడెం పంచాయతీ కార్య దర్శిగా పని చేసిన కాలంలో సహకరించిన సర్పంచ్ టిరీషా కాశీ దంపతులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బండ్రెడ్డి సత్యనారాయణ, సాధు పెంటయ్య, వాసిరెడ్డి రామ్మోహన్‌రావు, జోనుబోయిన రాంబాబు, పాపోలు పూర్ణ, సాయి, నాగేంద్ర పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన దీక్షలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్లకు నిరసన వ్యక్తం చేస్తూ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ గ్యారేజీ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరుకున్నాయి. కార్మిక సంఘాల నాయకులు ఎస్.కె.ఆసిఫ్, కె.ఎస్.రావు, బి.సుధీర్, వి.హెచ్.కార్తీక్, ఎం.వి.ఆర్.కె.రెడ్డి, కె.సురేష్ దీక్షల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ బంకులో జరిగిన అవకతవకలకు సంబంధంలేని ఉద్యోగులను సస్పెండ్ చేయడం తగదన్నారు. దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.

## మున్సిపల్ కార్మికులను పెంచాలి


జంగారెడ్డిగూడెం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభా ప్రకారం మున్సిపల్ కార్మికులను పెంచాలని ఏపీ ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఆయన మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కెవి.రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రేడ్-1 మున్సిపాలిటీ అయిన సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎంఈఎఫ్ ఏలూరు నాయకులు ఎల్.కృష్ణారావు, బి.వెంకటేశ్వర రావు, బండి రాజా, వి.కిశోర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రేలంగి నాగరాజు, కూనపాముల విఘ్నేశ్, సభ్యులు కె.నాగేశ్వరరావు, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ మృతి

లింగపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతలపూడి మాజీ సమితి అధ్యక్షుడు మండల సత్యనారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చింతలపూడి సమితి అధ్యక్షుడిగా 17 సంవత్సరాల పాటు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గంట మురళి రామకృష్ణ, ఉన్నమట్ల ఎలిజ పలువురు నియోజకవర్గ నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుమారుడు మంత్రపు సాయిబాబా గత ప్రభుత్వ హయంలో చింతలపూడి ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. గురువారం నాడు ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ

లింగపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని భవిత కేంద్రంలో సహా మండలంలోని పలు పాఠశాలలను, ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే జరిగే విధానాన్ని పరిశీలించారు. ధర్మాజీగూడెం పాఠశాలల్లో విద్యార్థుల ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే విధానాన్ని పరిశీలించారు. మెగా పీటీఎం 3 వివరాలడిగి తెలుసుకున్నారు. సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి రెడ్డి రామారావు, ప్రధానోపాధ్యాయురాలు, భవిత పాఠశాల ఉపాధ్యాయులు టి.మాణిక్యమ్మ, బి భాగ్యలక్ష్మీ, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోబోలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్

## సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

లింగపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఏఐ, రోబోటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో క్రిసాలిస్ పాఠశాలలో రోబోటిక్స్ కలాం సిఈఓ మహ్మద్‌సాజిద్, టి క్రాంతికుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఏఐ, రోబోటిక్స్ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, ఏఎంసీ చైర్మన్ దుర్గాపార్వతి, సత్యనారాయణ, చలపతిరావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం పెదపాడు సెక్షన్ పరిధిలో వట్లూరు సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం వట్లూరు - ఏపీఎఫ్ ఫీడర్, 11కేవీ భోగాపురం ఫీడర్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. వట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని వట్లూరు, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

**టి.నరసాపురం సబ్ స్టేషన్‌లో..**

టి.నరసాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహమ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. బండివారిగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, తిరుమలదేవిపేట సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

**పెదవేగి ఉపకేంద్రం పరిధిలో..**

పెదవేగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా పెదవేగి, లింగపాలెం మండలాల్లోని విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీ డీసీఎల్ ఈఈ కేఎం.అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. పెదవేగి మండలంలో పెదవేగి, కూచింపూడి రామశింగవరం, కవ్వగుంట, గుడిగుంట, విజయరాయి, జానంపేట, బాపిరాజుగూడెం, రాయన్నపాలెం, లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెం, ధర్మాజీగూడెం, నరసన్నపా లెం, ఆసన్నగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఉండదన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

భీమడోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి టీడీపీ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని టీడీపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. చెట్టున్నపాడు కొల్లేరులో సాగు కోసం, పెదలింగంపాడులో నీటి పైపులైను, ఇందిరా కాలనీలో డ్రైనేజీ సమస్యలను గ్రామస్తులు తెలియజేశారు.

## అన్‌ఎంప్లాయ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఎంపీకి వినతి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తూరు జూట్‌మిల్లు ఆకస్మాత్తుగా మూసివేసిన కారణంగా ఈఎస్ఐ ద్వారా కార్మికులకు అన్‌ఎంప్లాయ్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యూ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే చంటి, ఎంపీ పుట్టా మహేశ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈఎస్ఐ బెనిఫిట్స్ అందజేసేందుకు ఎంపీ మహేశ్ ఢిల్లీ స్థాయిలో చర్చలు చేపట్టారన్నారు. కార్మిక నాయకుల నుంచి ఆన్‌లైన్‌లో ఎంపీ మహేశ్ వివరాలు తీసుకున్నారని అన్నారు. త్వరలోనే కార్మికులు అన్‌ఎప్లాయ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని అన్నారు.

## భవానీ భక్తుల గ్రామోత్సవం

భీమడోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భీమడోలు కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గమ్మ భవానీ పీఠం మాలధారణ స్వాముల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. భీమడోలు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది స్వాములు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది.

## యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు

ఏలూరుటూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభువైన క్రీస్తు ప్రేమను కలిగి జీవించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అన్నారు. ఏలూరు సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏలూరు యునైటెడ్ క్రిస్టమస్ వేడుకలు సెంట్ జేవియర్ హైస్కూల్ బుధవారం రాత్రి జరిగాయి. బైబిల్ వండర్స్ టీవీ వర్తమానికులు డాక్టర్ జాన్ వెస్లీ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి,నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు.మన్నా చర్చ్ బిషప్ ఎం.ఎలిషారాజు, సీనియర్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు పాల్గొన్నారు.

## టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ఏలూరుఅర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షార్థుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించి, ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం నగరంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సంఘ నాయకులు పంపిణీ చేశారు. సంఘ నాయకులు చిట్టిబాబు, దొరబాబు, రాజేశ్వరి, రాజారావు, కిరణ్‌కుమార్, అప్పారావు, జ్యోత్స్న, పర్వీన్‌బేగం పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు చోరీ

లింగపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలం అనపనేనివారి గూడెంలో పొలంలోని వ్యవసాయ పంప్‌సెట్‌కు ఏర్పాటు చేసిన మూడు ట్రాన్స్ ఫార్మర్‌లలోని రాగి వైరు బుధవారం రాత్రి చోరీ చేసినట్టు లింగపాలెం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీకి గురవుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగిలింపబడిన రాగి వైరు విలువ 4 లక్షలు రూపాయలకు పైగా ఉంటుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

## 13న కలిదిండిలో ఆక్వా రైతుల జిల్లా సదస్సు

కలిదిండి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఈనెల 13న జిల్లా స్థాయి ఆక్వా రైతుల సదస్సును విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కన్వీనర్ బాలరామ్, చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబులు అన్నారు. గురువారం తాడినాడలో ఆక్వా రైతుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ట్రంప్ సుంకాలతో ఆక్వారంగంలో నెలకొన్న సంక్షోభ సమస్యను పరిష్కరించాలన్నారు. తాడినాడ సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, ఆక్వారైతులు కొత్తపల్లి బంగారు రాజు, గాదిరాజు రమేశ్‌రాజు, కే.నాగరాజు, ఎస్.సుబ్రహ్మణ్యరాజు, ఆర్.కృష్ణంరాజు, పి.రామరాజు, పాల్గొన్నారు.

## బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శ్రీకర్



చాట్రాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) బీజేపీ ఏలూరు జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడిగా సూరంపాలెం గ్రామానికి చెందిన బుర్రి శ్రీకర్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ నియామక పత్రం జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకర్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్లనేని రాజా, పలువురు మండల గ్రామ నాయకులు అభినందించారు. శ్రీకర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేసేదుకు అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

## బిల్లులు కావాలా.. లంచం ఇవ్వాల్సిందే..!

### రూ.లక్షన్నర తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈ

కొయ్యలగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):'మీరు చేసిన పనులకు బిల్లులు కావాలా ? అయితే మాకు లంచం ఇవ్వాల్సిందే..! లేకుంటే మీ బిల్లులు రావు. రకరకాల కొర్రీలు వేస్తాం' ఇదీ గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ మురళీకృష్ణ, డీఈ రమేష్‌ల తీరు. దీంతో విసిగిపోయిన ఓ కాంట్రాక్టరు ఏసీబీ అధికారులను ఆశ్రయించి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపిన వివరాలివి.. కొయ్యలగూడెం మండలంలో కాం ట్రాక్టర్ నల్లబోతు కోటేశ్వరరావు, జలజీవన్ మిషన్‌లో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చేశారు. రూ.70 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు సిబ్బందితో గురువారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో కొయ్యలగూడెం ఆర్‌డ బ్ల్యుఎస్ డీఈ కార్యాలయానికి వచ్చారు. కాంట్రాక్టర్ కోటేశ్వరరావు ఏఈ మురళీకృష్ణకు రూ.లక్ష, డీఈ రమేష్‌కు రూ.50 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వారిని విచారించి, విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని కోరారు. ఈ సందర్భంగా డబ్బుల విషయంలో ఈ అధికారులు తమను పీడిస్తున్నారని మరికొందరు కాంట్రా క్టర్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీఐలు బాలకృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

## ఏలూరు నగర కమిషనర్‌కు మెమో జారీ

ఏలూరు,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):బాపట్ల మున్సిపాల్టీలో కమిషనర్‌గా పనిచేస్తున్న కాలంలో భూసేకరణలో ఉన్న ఒక రోడ్డు(ప్రైవేట్ రోడ్డు) నిర్మాణం చేసిన విషయంలో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు కార్పొరేషన్ ప్రస్తుత కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్‌కు పుర పాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ గురువారం మెమో జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనల అతిక్రమణలపై 10 రోజుల్లో రాత పూర్వకంగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లేకపోతే మీపై చర్యలకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టులో ఏలూరుకు భానుప్రతాప్ బదిలీపై వచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా జరగాలి



ధాన్యంలో తేమశాతాన్ని చూసే ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

ముసునూరు, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా జరగాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. గురువారం కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ మీటరు ద్వారా ధాన్యం తేమ శాతం చూసే విధానాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం పీఏసీఎస్‌లలో ఉన్న గోనె సంచుల స్టాక్, నాణ్యతను తనిఖీ చేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా సరైన సేవలు అందుతున్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తమకు అవసరమైన సేవలు సకాలంలో అందుతు న్నాయని, కొనుగోలు ప్రక్రియ బాగానే ఉందని రైతులు ఆమెకు వివరించారు. ఏవో ఎ.చాముండేశ్వరి, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు, వీపీఏ రాజేష్, కాంక్ష, వీఆర్వో వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలు !

ఆగిరిపల్లి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):నరసింగపాలెం,అమ్మవారి గూడెంలలో ఉన్న కొండలను భారీ యంత్రాలతో తవ్వి గ్రావె ల్‌ను బయట ప్రాంతాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. గురువారం రాత్రి అమ్మవారి గూడెంలో నరసింగలెంలో గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. నరసింగపాలెంలో ఎక్స్‌వేటర్ సాయంతో తవ్వి సుమారు 20 లారీల్లో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదే విషయంపై తహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా నరసింగపాలెంలో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని తెలిపారు. గ్రామస్థులు మాత్రం అనుమతులు ఉంటే రాత్రి పూట గ్రావెల్ తవ్వకాలు జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు.

## నల్లికాటు..జ్వరం పోటు!

(5వ పేజీ తరువాయి)

కుటుంబ సంక్షేమశాఖ/ ఎన్‌హెచ్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ల్యాబ్‌ను మెడికల్ డైరెక్టరేట్ (డీఎంఈ)కి బదలా యించడంతో నిర్వహణ జీజీహెచ్ చేతుల్లోకి వెళ్లింది. ప్రస్తుతం మూతపడిన ఈ ల్యాబ్‌లో హెపటైటిస్, డెంగీ, మలేరియా, కొవిడ్ వేరియంట్లు, స్క్రబ్ టైఫస్‌వంటి రోగాల బారిన పడిన రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను విశ్లేషించేందుకు వినియోగించే 9 ఆర్టీపీసీ ఆర్ మిషన్లు, 2 బయోస్టెమ్‌లు, 3 ఆటోమేటెడ్ మిషన్లు, రసాయనాలు, కిట్లువంటి రూ.2.50 కోట్ల విలువైన ల్యాబ్‌సామగ్రి నిరుపయోగంగా పడి ఉంది. సాధారణ రోజుల్లో ఈ ల్యాబ్‌కు రోజుకు సగటున 10 వరకు శాంపిల్స్ విశ్లేషణ, రోగ నిర్ధారణ నిమిత్తం వస్తుండేవి. తాజాగా స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగులోకి వస్తున్న వేళ ఇకనైనా ఈ ఆర్టీపీసీఆర్/వీఆర్‌డీఎల్ ల్యాబ్‌ను పునఃప్రారంభించడానికి తక్షణ చర్యలు అవసరం.

## స్మార్ట్‌గా..సూక్ష్మసేద్యం !

(5వ పేజీ తరువాయి)

చొప్పున రూ.22 వేలు మంజూరు చేస్తారు. ఇతర రైతులకు 45 శాతం రాయితీ చొప్పున రూ.18 వేలు ఇస్తారు. ఆటోమేషన్ అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొన్నేళ్లుగా సూక్ష్మసేద్యం చేస్తున్నవారు వైర్‌లెస్ ఆటోమేషన్‌కు అమర్చుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే నిబంధనలకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాలను పొందాలనుకునేవారు ఆటోమేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. స్టార్టర్లు, వాల్వ్ ఆన్, ఆఫ్‌తో పాటు ఇతర సెన్సర్ పరికరాలకు రైతులు అమర్చుకోవచ్చు. హెక్టారుకు గరిష్ఠంగా యూనిట్ విలువ రూ.40వేలుగా పరిగణించి.. అందుకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. ఆటోమేషన్ పరికరాలకు కనీసం ఏడాది వారంటీ ఉండాలని నిబంధనల్లో పేర్కొంది.

## మొక్కుబడిగా..

(5వ పేజీ తరువాయి)

ఇచ్చేందుకు ముందుకొచ్చిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తాజాగా జీలుగుమిల్లిలో జరిగిన గ్రామసభకు సైతం పీఎన్ (ప్రాథమిక ప్రకటన)లో పేర్లు నమోదైన రైతులందరికీ రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహిస్తున్నట్టు సమాచారం ఇవ్వలేదన్నారు. సభ జరుగుతున్నట్టు సమాచారం తెలుసుకున్న కొందరు రైతులు హడావుడిగా సభకు వచ్చి తమ సమస్యలు తెలుపుకున్నారు. మరోవైపు అన్నదమ్ముళ్ల మధ్య పంపకంలో తేడాలు ఉండి పార్టిషన్ డీడ్ లేని భూములను సైతం అధికారులు భూసేకరణలో ఉంచారని కొందరు రైతులు వాపోతున్నారు. పీఎన్‌లో సర్వే నెంబర్లు తప్పుగా నమోదైన వాటిని సరిచేయాలని, రికా ర్డులు సక్రమంగా లేని భూముల్ని పరిశీలించాలని విన్నవించారు. అయితే అటువంటి విషయాలు కోర్టులో తేల్చుకోవాలని అధికారులు చెబుతున్నారని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామసభ నిర్వహించే విషయమై రైతులకు సమాచారం లేదన్న విషయమై ఎస్‌డీసీ డి.చంద్రశేఖర్‌ను వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వీఆర్వో రామతులసిని వివరణ అడగ్గా గ్రామసభ ఏర్పాటు విషయమై రైతులకు నోటీసులు పంపామన్నారు. అయితే కొందరు రైతులు తమకు ఏ నోటీసులు అందలేదని చెప్పడం గమనార్హం. సమావేశంలో సర్పంచ్ చిర్రి జగదాంబ, రెవెన్యూ అధికారులు సిబ్బంది ఉన్నారు.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 149, 158, 169 |
| చికెన్ విత్ స్కిన్ | 284 |
| చికెన్ స్కిన్‌లెస్ | 294 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

## ఒకే ఏడాదిలో రూ.2 వేల కోట్లు పరిహారం

- పోలవరం నిర్వాసితులకు సీఎం చంద్రబాబు అండ
- ప్రాజెక్టులో ఇప్పటికే 88 శాతం పనులు పూర్తి

మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

పోలవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఒకే ఏడాదిలో రూ. 2 వేల కోట్లు పరిహారంగా అందించి నిర్వాసితులకు సీఎం చంద్రబాబు అండగా నిలిచారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కూటమి పాలనలో, చంద్రబాబు నేతృత్వంలో ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 88 శాతం పనులను అన్ని ప్రతికూల వాతావరణాలను అధిగమించి పూర్తిచేశామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును మంత్రి గురువారం సందర్శించారు. ప్రాజెక్టులో గ్యాప్ 1, గ్యాప్ 2, కుడి ప్రధాన కాలువ జంట గుహలు, హెడ్ రెగ్యులేటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఫొటో ఎగ్జిబిషన్, మ్యాప్‌లను పరిశీలించారు. ఈఎన్‌సీ ఎన్.నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు, మేఘా ప్రతినిధులు అంగర సతీష్, గంగాధర్ పనుల పురోగతిని వివరించారు. అనంతరం మంత్రి జలవనరులశాఖ అధికారులు, మేఘా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రణాళి కలకు, ఆదేశాలకు అనుగుణంగా, నిర్దేశించిన లక్ష్యానికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తర్వాత మీడియాతో మాటాడారు. ఆయన ఏమన్నారంటే.. 'వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టులో విధ్వంసం జరిగితే కూటమి పాలనలో ప్రాజెక్టుని గాడిన పెట్టి నిర్మాణాలు చేస్తున్నాం. గత ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేక పోయేవారు. ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాంలో ప్రధాన మైన డయాఫ్రంవాల్ పనులను నేటికి 950 మీటర్ల మేర 75 శాతం పనులు పూర్తి చేశాం. జగన్ పాలనలో రెండేళ్లలో 2 శాతం పనులు చేస్తే కూటమి పాలనలో ఒక్క ఏడాదిలోనే 12 శాతం పూర్తి చేశాం. కుడి ప్రధానకాలువ కనెక్టివిటీలో క్లిష్టమైన జంట గుహల లైనింగ్ పనులు 82 శాతం, ఎడమ ప్రధాన కాలువ కనెక్టివిటీ పనులు 62 శాతం పూర్తయ్యాయి. డయాఫ్రం వాల్‌ని జగన్ పాలనలో ధ్వంసం చేస్తే నేడు మళ్లీ రూ. 900 కోట్లతో నిర్మాణం ప్రారంభించాం. రానున్న ఫిబ్రవరికి పూర్తి చేస్తాం" అని పేర్కొన్నారు. సమావేశంలో ప్రాజెక్టు సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ డి.ప్రశాంతి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ వి.అభిషేక్, ప్రత్యేక కలెక్టర్ ఎస్.సరళ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు ఎన్జీవోస్ తాలుకా యూనిట్ నూతన కార్యవర్గ సభ్యులు

## ఎన్జీవోస్ తాలుకా అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీం

కైకలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ కైకలూరు తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీం, కార్యదర్శిగా తలారి పూర్ణ కృష్ణవంశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కైకలూరు ఎన్జీవోస్ భవనంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెర్సు రామారావు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల అధికారిగా గొన్నూరి శ్రీధర్‌రాజు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ కైకలూరులో మొదటిసారిగా ఎన్నికల్లో పాల్గొంటున్నామని, ఉద్యోగుల సమస్యలను జిల్లా సంఘం దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తూర్పు, కృష్ణా జిల్లాల అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాస్, కార్యదర్శి ఆత్మూరి వెంకటేశ్వరరావు, జేఏసీ నాయకులు ఆర్ఎస్ హరినాథ్, జి.రవికుమార్, ఎం.లీలారాణి పాల్గొన్నారు.

## క్లస్టర్ ప్రతిపాదన విధానాన్ని విరమించుకోవాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్పీలు

కైకలూరు/ముసునూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూల్ కాంప్లెక్స్ ఎ, బి క్లస్టర్ ప్రతిపాదన విధానాన్ని విరమించుకోవాలని ఉపాధ్యాయులు, సీఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ తలారి వంశీకి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు దండే బెనర్జీ, మారెళ్ళ రవిశంకర్, ఆలపర్తి చిట్టిబాబు, వడ్డీ శ్రీనివాసరావు, అక్బర్ హుస్సేన్, పాల్‌రాజు, సుధాకర్, సునీత, సుగుణ తదితరులు పాల్గొన్నారు. క్లస్టర్ విధానాన్ని నిలిపివేయాలని ముసునూరు మండల తహసీల్దార్ దాసరి ప్రశాంతికి క్లస్టర్ రిసోర్స్ మోనటరింగ్ టీచర్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసు, మోహన్‌రావు, నాగేశ్వరరావు, సుజాత, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల నటులను సత్కరిస్తున్న ఈవో సింగనపల్లి, ఉత్సవ కమిటీ సభ్యులు

## రంగస్థల నటులకు ఘన సత్కారం

కలిదిండి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీకాళహస్తి మహత్యం నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలో అద్భుతంగా నటించిన రంగస్థల నటులు జి.సూర్యనారాయణ, ఎం.దామోదరరావు, ఆర్.జగదీశ్వరరావు, కరణం శంకరరావు, ఎస్.సరస్వతిలను ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు, దుగ్గిరాల పరమేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జి అక్కల వెంకటాచలం, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## ధాన్యం నిల్వలపై జేడీఏ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ముదినేపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో

ముదినేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో ముదినేపల్లి మండలంలో నెలకొన్న పరిస్థితులపై నివేదిక పంపాలని ఏలూరు జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా ఆదేశాలు జారీ చేశారు. 'దిత్వాతో దిక్కుతోచని రైతన్న' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన జేడీఏ మండలంలో ధాన్యం కొనుగోళ్ళ, మిల్లర్ల టార్గెట్లు, వరి కోతలు తదితర అంశాలపై సమగ్రమైన నివేదిక పంపాలని మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్‌ను ఆదేశించారు. దీనిపై ఏవో వివరణ ఇస్తూ ప్రస్తుత ఖరీఫ్ సీజనులో మండలంలో 14,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశారని, ఇప్పటి వరకు సుమారు 5 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మండలంలో 8,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, ఇంకా 600 మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులపై ఉందని, ఆ ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారని తెలిపారు. మరో 738 మెట్రిక్ టన్నుల ధాన్యం సంచుల్లో నింపి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉందని, సుమారు 200 ఎకరాల్లో వరిపైరు పనమీద ఉందన్నారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్నట్టు తెలిపారు.



డీడీవో కార్యాలయాన్ని వర్చువల్‌లో ప్రారంభిస్తున్న దృశ్యం

## డీడీవో కార్యాలయం ప్రారంభం

నూజివీడు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూజివీడు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ వర్చువల్‌లో లాంఛనంగా ప్రారంభించారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సుమారు రూ.15 వ్య యంతో అభివృద్ధి పరిచారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్ను రాఘవేం ద్రనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు ముసునూరి రాజా, జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో కూడా కార్యాలయాలు ప్రారంభించారు.



సుబ్రహ్మణ్య హవనం నిర్వహిస్తున్న ఏసీ, కమిటీ సభ్యుడు రవికుమార్ దంపతులు.. త్రిశూలేశ్వరస్నానం

## వైభవంగా సుబ్రహ్మణ్య హవనం పూజలు

ముదినేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా సింగరాయపాలెం -చేవూరుపాలెంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సుబ్రహ్మణ్య హవనం పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామి వార్ల సన్నిధిన యాగం జరిపి మూలమంత్రాలు జపించి పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, అవభృతస్నానం, త్రిశూలేశ్వర స్వామి స్నపనం నిర్వహించి సంప్రదాయ పూజలు జరిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్ దంపతులు నీలం శివ రమేష్, బుసనబోయిన సోవమ్మ తదితరులు యాగ పూజలు చేశారు. కైకలూరు మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు దంపతులు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు దంపతులు, దేవస్థానం మాజీ చైర్మన్ రంగిశెట్టి నరసింహారావు, జనసేన నాయకుడు ఎన్.బాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రత్యేకంగా అలంకరణలో పెద్దింటి అమ్మవారు.. పడిపూజలో పాల్గొన్న మాలాధారణ భక్తులు

## వైభవంగా పెద్దింటి అమ్మవారి సన్నిధిలో పడిపూజ

కైకలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి ఆలయంలో మాల ధారణ దీక్షలో భాగంగా పడిపూజను వైభవంగా గురువారం రాత్రి నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు పెద్దింటి అమ్మవారి మండల మాలాధారణ దీక్ష నిర్వహిస్తున్న భక్తులు మార్గశిర పౌర్ణమి సందర్భంగా పడిపూజ, నిప్పులగుండం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం, ఏలూరుకు చెందిన అర్చక బృందం, మహిళల కోలాట ప్రదర్శనను నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున పడిపూజ, నిప్పులగుండం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో బయలుదేరి ఆగిరిపల్లి గ్రామంలోని నాలుగు పురవీధులలో కలశ జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల మధ్య శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షణలో అమ్మవారు పల్లకిలో విహరించారు. ఆలయం వద్ద గురువారం రాత్రి వైభవంగా హోమం నిర్వహించారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్ష భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వైభవంగా కనకదుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఆగిరిపల్లి : కనకదుర్గమ్మ కలశ జ్యోతుల ప్రదర్శన, గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక వరాహ పుష్కరిణి సమీపంలో వున్న కనకదుర్గమ్మ ఆలయంలో,

### ఘనంగా దత్త జయంతి

మండవల్లి : లోకుముడి దత్తాశ్రమంలో దత్త జయంతి, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. గురువారం దత్తాశ్రమం ట్రస్టీ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ దంపతులు దత్తాత్రేయ స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకాలు, మహాచండీ హోమాన్ని నిర్వహించారు.

## 'కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయం'



ఆగిరిపల్లిలో రోశయ్య చిత్రపటం ఆర్యవైశ్య సంఘం నాయకుల నివాళి

ఆగిరిపల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం అన్నారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వై.చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, వై.రాంబాబు, జె.కోటేశ్వరరావు, వై.రమేష్, కె.ముక్తేశ్వరరావు, వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లిలో..**

ముదినేపల్లి : ఆర్యవైశ్య ప్రముఖుడు దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ముదినేపల్లిలో నిర్వహించారు. ముదినేపల్లి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, సంఘ నాయకులు కొల్లిపర రఘురామన్, వత్తుమిల్లి ప్రసాద్, బుద్దా రామకృష్ణ, కురిచేటి తిరుమల ప్రసాద్ తదితరులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కృత్రిమ కాళ్ల అమరికకు స్క్రీనింగ్ పరీక్షలు

నూజివీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, ఆధ్వర్యంలో గురువారం కృత్రిమ కాళ్లు అమ ర్చేందుకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. నూజివీడు రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపునకు మొత్తం 40 మంది హాజ రవగా 36 మందికి కృత్రిమ కాళ్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మండా శ్రీనివాస్, పీడీ వెంకటరత్నం, బోయపాటి ముఖర్జీ, అనిల్, లక్ష్మణస్వామి, రాజగోపాల్, మలిశెట్టి శ్రీనివాస్, పొట్లూరి ప్రసాద్, సాయి భాస్కర్, వెంటేశ్వరరావు, సబ్బినేని శ్రీనివాస్, నరేంద్ర, లావు మురళి, తదితరులు పాల్గొన్నారు.

## బోర్ల నుంచి కేబుల్ వైర్లు మాయం

నూజివీడు టౌన్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బోర్ల నుంచి కాపర్ వైర్లను చోరీ చేసే దొంగలను అదుపులోకి తీసుకుని రోజులు గడవకముందే మళ్లీ బోర్లు వద్ద కాపర్ వైర్లు, ఏకంగా స్టార్టర్ బోర్డులతో సహా దొంగతనం చేయడంతో రైతులు నిర్ఘాంత పోవాల్సి వస్తుంది. బుధవారం రాత్రి నూజివీడు, ముసునూరు మండలాల సరిహద్దుల్లోని జంగంగూడెం తుక్కులూరు గ్రామాల శివార్లులో ఉన్న వ్యవసాయ భూముల్లో గల మోటార్ల కాపర్ వైర్లు కత్తిరించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న విత్తనం విత్తే సీజన్‌లో దొంగలు ఈవిధంగా కాపర్ వైర్లను దొంగలించడంతో అదునులో నీరందక పంటను నష్టపోవల్సి వస్తోందని వైర్ల దొంగల నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



ముదినేపల్లి జూనియర్ కళాశాల వద్ద ఏర్పాట్లు

## మెగా పీటీఎంకు విస్తృత ఏర్పాట్లు

ముదినేపల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ శుక్రవారం నిర్వహించే మెగా పేరెంట్-టీచర్స్ 3.0 సమావేశాలకు ముదినేపల్లి మండలంలో అధికారులు, ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘు ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 59 ప్రాథమిక పాఠశాలల్లో ఈ పీటీఎంలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమ నిర్వహణకు పీఈ టీలు, ఆఫీసు సిబ్బంది, కొంతమంది ఉపా ధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. సమా వేశాల అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు.

## స్కూల్ అసిస్టెంట్‌కు పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కైకలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అకడమిక్ విద్యాశాఖలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హత కల్గిన వారు ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో డి.రామారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్‌కు రూ.12,500, ఎస్టీటీ రూ.10వేలు నెలకు గౌరవ వేతనం ఇస్తామన్నారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సంస్కృతం సబ్జెక్టులో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



పూజలు నిర్వహిస్తున్న కమిషనర్ పీరయ్య

## కమిషనర్ ప్రత్యేక పూజలు

నూజివీడు టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : నూజివీడు పట్టణంలోని నవగ్రహ అనుగ్రహ క్షేత్రంలో నూజివీడు కమిషనర్ పీరయ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఆయన సతీ సమేతంగా నవగ్రహ అనుగ్రహ క్షేత్రంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

## దివ్యాంగుడికి టీడీపీ నేత సాయం

ముదినేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కులధ్రువీకరణ పత్రం లేదని ఏడేళ్లుగా పెన్షన్ మంజూరు కాని గురజ గ్రామంలోని ఎస్టీ వర్గానికి చెందిన తాడిగుడి రంగారావు అనే దివ్యాంగుడికి టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సాయాన్ని శోభనాద్రి చౌదరి కుమారుడు ఆదిత్య చౌదరి గురువారం ఆ దివ్యాంగుడికి అందజేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, టీడీపీ నాయకులు అడుసుమిల్లి రామకృష్ణ, వీరిశెట్టి కొండలరావు, చేడిగపవన్ పాల్గొన్నారు.